

జంగారెడ్డిగూడెం అన్న క్యాంటీన్ భవనంలో వార్డు సచివాలయం


ఏలూరులో మరమ్మతు చేస్తున్న అన్న క్యాంటీన్ భవనం

ఆకలి తీర్చేలా..

అన్నక్యాంటీన్లు తయార్

పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు రంగం సిద్ధమైంది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వీటిని వైసీపీ ప్రభుత్వం మూసివేసింది. రాజకీయ కారణాలతో పేదల కడుపు కొట్టింది. క్యాంటీన్ భవనాలు కొన్నింటిని ప్రభుత్వ కార్యాలయాలుగా, మరి కొన్ని గ్రామ సచివాలయాలుగా వాడేసింది. తిరిగి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు పేదవారి ఆకలి తీర్చేలా అన్న క్యాంటీన్లు తెరవడానికి కార్యాచరణ చేపట్టారు.



- భవనాల మరమ్మతుకు అంచనాలు
- పనులు చేపడుతున్న అధికారులు
- కొన్ని చోట్ల ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ
- ఖాళీ చేయాలని తాఖీదులు
- వచ్చే నెలలో పునరుద్ధరణకు చర్యలు

ఏలూరు టూటౌన్, జూలై 9: పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు రంగం సిద్ధమైంది. గతంలో టీడీపీ ప్రభుత్వ ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మూసి వేసింది. క్యాంటీన్ భవనాలు కొన్నిటిని ప్రభుత్వ కార్యాలయాలు, మరి కొన్ని గ్రామ సచివాలయాలుగా వినియోగించారు. అన్న క్యాంటీన్ల భవనాలు మరమ్మతు చేయడానికి నగరపాలక సంస్థ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పేదల కడుపు నింపడానికి ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారు. ఎన్టీఆర్ పేరుతో పేదల కోసం చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్లను నెలకొల్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్లను పూర్తిగా మూసివేశారు. క్యాంటీన్ల కొనసాగిస్తే చంద్రబాబుకు పేరుస్తుందని పేదల కడుపు కొట్టారు. తిరిగి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను పునరుద్ధరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో నాలుగు భవనాలు ఈ నెలఖరుకు మరమ్మతులు పూర్తిచేసి ఆగస్టు మొదటి వారంలో పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టారు. కలెక్టరేట్, ఆర్ఆర్.పేట వేంకటేశ్వరస్వామి ఆలయం, తంగెళ్ళమూడి వంతెన, వైఎంహెచ్ హాలు వద్ద నాలుగు భవనాల మరమ్మతులకు అధికారులు అంచనాలు తయారు చేశారు. విద్యుత్, ఇంటర్నెట్, సీసీ కెమెరాలు, ఇతర పరికరాలకు దాదాపు రూ.9లక్షలు అవుతాయని అంచనా వేశారు. సిమెంటు, కాంక్రీటు పనులతో పాటు ఫర్నిచర్, కిచెన్‌లో సౌకర్యాలు, ఇతర మరమ్మతులకు మరో రూ.15లక్షల వరకు అవసరమని ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేశారు. దీనికి నగర కమిషనర్ ఆమోద ముద్ర వేశారు. అన్న క్యాంటీన్ భవనాల్లో నిర్వహిస్తున్న సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను ప్రస్తుతం తొలగించారు.

జంగారెడ్డిగూడెంలో టెండర్లు

జంగారెడ్డిగూడెం : పట్టణంలో అన్న క్యాంటీన్ మరమ్మతు పనులకు మునిసిపల్ అధికారులు టెండర్లు పిలవనున్నారు. క్యాంటీన్ భవనంలో నిర్వహిస్తున్న వార్డు సచివాలయాన్ని వేరొక చోటికి తరలిస్తున్నారు. 2019 ఫిబ్రవరి 13న అప్పటి ఎమ్మెల్యే పీతల సుజాత, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్మించిన అన్న క్యాంటీన్ భవనం ప్రారంభించారు. కొద్దిరోజుల్లోనే ప్రభుత్వం మారడం, అధికారంలోకి వచ్చిన వైసీపీ అన్న క్యాంటీన్‌లను మూసివేసింది. అన్న క్యాంటీన్ భవనంలో 8వ వార్డు సచివాలయం ఏర్పాటే చేశారు. తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో అన్న క్యాంటీన్లను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నారు. క్యాంటీన్ భవనం పూర్తి స్థాయిలో సిద్ధం చేయడానికి టెండరు పిలుస్తామని మున్సిపల్ కమిషనర్ జె.నరేంద్రకుమార్ తెలిపారు.

ఆగస్టులో అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తాం

నగరంలో అన్న క్యాంటీన్ భవనాలను గత ప్రభుత్వం వేరే కార్యకలాపాలకు వినియోగించడంతో దెబ్బతిన్నాయి. ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఆదేశాల మేరకు అన్న క్యాంటీన్ భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలను తొలగించాం. మరమ్మతు పనులకు అంచనాలు రూపొందించి పనులు ప్రారంభించాం. ఆగస్టులో అన్న క్యాంటీన్లు పునఃప్రారంభిస్తాం.

ఎస్.వెంకటకృష్ణ, కమిషనర్, నగర పాలక సంస్థ, ఏలూరు

● అంబులెన్స్‌కు ప్రమాదం



ప్రమాదంలో బాధితులను తక్షణం ఆస్పత్రికి తరలించే అంబులెన్స్ ప్రమాదానికి గురైంది. ఉంగుటూరు మండలానికి చెందిన 108 అంబులెన్స్‌లో మంగళవారం కైకరం నుంచి డయాలసిస్ పేషెంట్‌ను ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలిస్తున్నారు. జాతీయ రహదారిపై ఎడమవైపు ఆగివున్న లారీ అకస్మాత్తుగా కుడివైపు రావడంతో 108 డ్రైవర్ దానిని తప్పించబోయి హోర్డింగ్ పోల్ దిమ్మను ఢీకొన్నాడు. ఇంజన్ భాగం దెబ్బతింది. అంబులెన్స్‌లో ఉన్నవారికి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పేషెంట్‌ను మరో వాహనంలో పంపించినట్లు 108 జిల్లా మేనేజర్ వెంకట్ తెలిపారు. - ఏలూరు క్రైం


ఏలూరులో మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేష్

హామీలు నెరవేరుస్తా : ఎంపీ మహేష్

ఏలూరు టూటౌన్, జూలై 9: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తా. నా పై నమ్మకం ఉంచి గెలిపించిన మీ రుణం తీర్చుకుంటా. కార్యకర్తలకు పెద్ద పాలేరుగా సేవలందిస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాల అనంతరం మంగళవారం ఏలూరు వచ్చిన ఎంపీకి కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. హనుమాన్ జంక్షన్ నుంచి భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు మహేష్ యాదవ్‌ను ర్యాలీగా తీసుకొచ్చారు. అంబికామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్, చింతలపూడి ఎత్తి పోతల పథకాలు పూర్తి చేయడమే తన లక్ష్యమన్నారు. పొగాకు, పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కేంద్రంతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. ఎరువులపై సబ్సిడీ, కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఏలూరును స్మార్ట్ సిటీగా గుర్తించేందుకు కేంద్రాన్ని ఒప్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. పోలవరం ప్రాజెక్టు, కాఫర్‌డ్యాం, డయాఫ్రం వాల్ కొత్తవి నిర్మించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం పోలవరం నిర్మాణానికి రూ.63 వేల కోట్లు ఖర్చవుతాయని, వీటిని కేంద్రం నుంచి రాబట్టేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.


రొయ్యల చెరువులో నిరంతరాయంగా తిరుగుతున్న ఏరియేటర్లు

ఆక్వా ఉక్కిరిబిక్కిరి

భారీ వర్షాలతో చెరువుల్లో పడిపోతున్న ఆక్సిజన్

- చేప, రొయ్యలకు వైరస్ భయం
- వ్యాధుల బారిన రొయ్యలు
- రేయింబవళ్లు చెరువు వద్దే రైతులు

కలిదిండి, జూలై 9: జిల్లాలో వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆక్వా రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చెరువుల్లో ఆక్సిజన్ కొరత, వైరస్ దాడితో ఏ నిమిషంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. ఏమాత్రం అదమరుపుగా ఉంటే సొమ్మంతా నీటి పాలే. ఎలాగైనా ప్రతికూల వాతావరణం నుంచి బయట పడాలని రేయింబవళ్లు చెరువుల వద్దే కాపలా ఉంటున్నారు. వర్షాకాలంలో ఆక్వాపై వాతావరణం ప్రభావం అధికం. వర్షాలు వల్ల వాతావరణంలో ఉష్ణోగ్రత పడిపోవటంతో చెరువుల్లో ఆక్సిజన్ స్థాయిలో ఒక్కసారిగా పడిపోతున్నాయి. ఒక పక్క పీహెచ్ స్థాయి తగ్గిపోయి రొయ్యలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. చెరువుల్లో అమోనియ శాతం పెరిగి రొయ్యలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. ఒత్తిడికి గురైన రొయ్యలు బలహీనం కావడంతో వాటిపై వైరస్, బ్యాక్టీరియా ప్రభావం పెరుగుతుంది. దీంతో రొయ్యలు వ్యాధుల బారినపడి చనిపోతున్నాయి. అమోనియా, నైట్రేట్‌లు సాధారణ స్థాయిలో కాకుండా హెచ్చు తగ్గులు ఏర్పడి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తున్నాయి. దీంతో ఆక్వా రైతులు నష్టపోతున్నారు.

వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చెరువుల్లో రొయ్య పిల్లల సంఖ్య తక్కువగా వేసుకోవాలి. ప్రతీ 50 వేల పిల్ల రొయ్యకు ఒక ఏరియేటర్ తిరిగేలా చూసుకోవాలి. వర్షాకాలంలో సాయంత్రం ఏడు గంటల నుంచి ఏరియేటర్లు తిప్పుకుంటే కొంత వరకు రొయ్యలు ఒత్తిడికి గురికాకుండా ఉంటాయి. వర్షాకాలంలో వైరస్ ఎక్కువ ఉంటుంది. భూమిలో ఉండే వైరస్ తేమ వాతావరణంలో విజృంభించి రొయ్యలపై దాడి చేసే అవకాశం ఉంటుంది. ఏ చెరువైనా వైరస్ వ్యాధికి గురైతే తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

రొయ్యలపై వాతావరణం ప్రభావం



వానాకాలంలో రొయ్యలపై వాతావరణ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఏ క్షణంలో అయినా రొయ్య తేలిపోతుంది. నీటి నాణ్యత పరీక్షలకు ప్రభుత్వం ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తే రైతులకు మంచి ఫలితాలు అందుతాయి.

దుగ్గిరాల పరమేశ్వరరావు, ఆక్వా రైతు

కాపాడుకుంటున్నాం



వర్షాకాలంలో వైరస్ వ్యాప్తి ఎక్కువ. వైరస్ రాకుండా చెరువుల్లో నిత్యం మందులు చల్లుకోవాల్సి వస్తుంది. రొయ్యలు ఒత్తిడికి గురికాకుండా రేయింబవళ్లు ఏరియేటర్లు తిప్పుతూ చెరువుల వద్ద ఉంటున్నాం.

పోకల శ్రీనుబాబు, ఆక్వా రైతు

కుక్కునూరులో అత్యధిక వర్షం

ఏలూరుసిటీ, జూలై 9: జిల్లాలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా కుక్కునూరు మండలంలో 14.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 3.5 మి.మీ. వేలేరుపాడులో 10, పెదవేగిలో 9.8, ఏలూరు అర్బన్‌లో 9, దెందులూరులో 8.4, నిడమర్రులో 8.2, జీలుగుమిల్లిలో 6, ఉంగుటూరులో 6, కలిదిండిలో 5, పెదపాడులో 3.6, కైకలూరులో 3.2, ఏలూరు రూరల్‌లో 3.2, జంగారెడ్డిగూడెంలో 2.2, పోలవరంలో 2, ముదినేపల్లిలో 1.2, మండవల్లిలో 1.2, భీమడోలులో 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రి సెల్వి

పరిశ్రమలతోపాటు ప్రజల ఆరోగ్యం ముఖ్యం

అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఏలూరు అర్బన్, జూలై 9 : పరిశ్రమల ఏర్పాటుతోపాటు, పరిసర ప్రజల ఆరోగ్యాన్నికూడా పరిగణనలోకి తీసుకుని మరిన్ని భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ, కర్మాగారాలు తదితరశాఖల అధికారులతో మంగళవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. చిన్నపాటి నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. పరిశ్రమల్లో భద్రత, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన ఎస్ఓపీ ప్రామాణికాలను తప్పనిసరిగా పాటించేలా సంబంధిత అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కేటాయించాల్సిన భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ త్రినాథరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జి, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు, పీసీబీ పర్యావరణ ఇంజనీరు వెంకటేశ్వరరావు, ఉప కార్మిక కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి వ్యాప్తి తీవ్రతకు కారణాలేంటి

జిల్లాలో కుష్ఠు బాధితుల సంఖ్య ఎక్కువ కావడంపై శాస్త్రీయ కారణాలను అన్వేషించాలని కలెక్టర్ వెట్రిసెల్వి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు జిల్లావ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహణకు సంబంధిత వైద్యాధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కుష్ఠు వ్యాధి నిర్మూలన అవగాహన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. అవగాహనతోనే బాధితులను గుర్తించవచ్చని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సర్వేలో భాగంగా ఇంటింటికి వచ్చే ఆశా వర్కర్లు, వైద్యసిబ్బందికి ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు. అనంతరం క్షయ వ్యాధిపై సమీక్షించారు. డీఎంహెచ్‌వో శర్మిష్ట, లెప్రసీ, సత్యనారాయణ, డీఐవో నాగేశ్వరరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ చీటీ ఉంటేనే మందుల విక్రయం

వైద్యులు ఇచ్చిన చీటీ(ప్రిస్క్రిప్షన్) ప్రకారమే మందుల షాపుల్లో ఔషధాలు విక్రయించాలని, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు తనిఖీలు చేయాలని కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై వైద్యశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ, రెవెన్యూ పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. లింగ నిర్ధారణ పరీక్షలను కఠినంగా అణచివేసేందుకు ఎన్జీవో సంస్థల ప్రతినిధులను సమన్వయం చేసుకుని అధికారులు డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ఆర్ఎంపీ వైద్యులు అందించే వైద్య చికిత్సలపై కూడా సంబంధిత అధికారులు ఆరా తీయాలని ఆదేశించారు.

దిష్టి రాళ్లు

జగనన్న భూరక్ష పథకంలో వృథా వ్యయం

భూ రీసర్వే పూర్తిచేసి హద్దుల్లో నాటడానికి ఉద్దేశించిన వైఎస్ఆర్ జగనన్న భూరక్ష పథకం సర్వే రాళ్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు వ్యయ ప్రయాసలకోర్చి వీటిని తయారు చేశారు. వారికి డబ్బులు ఇవ్వకపోగా రాళ్లు వినియోగించక రీసర్వే గ్రామాల్లో గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. అధికారుల ఒత్తిడి మేరకు రాళ్లు నాటాలని సిబ్బంది వెళ్లినా రైతులు ఏమాత్రం అంగీకరించలేదు. అన్నిచోట్ల రాళ్లు నాటినట్లు చూపి సొమ్ము స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.



- భూముల రీసర్వేపై రైతుల అభ్యంతరం
- వృథాగా పడివున్న సరిహద్దు రాళ్లు
- గ్రామాల్లో ఎక్కడికక్కడ గుట్టలు

ఏలూరు రూరల్, జూలై 9: వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే వివిధ కారణాలతో ఆదిలోనే ఆగింది. సర్వే సక్రమంగా జరగకపోవడం, శాస్త్రీయత లేకపోవడం, రైతుల అభ్యంతరాలతో అడ్డంకులు పడ్డాయి. రీసర్వే రాళ్ళవల్ల ఎవరికి ఎటువంటి ప్రయోజనం లేకపోయినా ప్రభుత్వ ఒత్తిడి మేరకు గ్రానైట్ ఫ్యాక్టరీలకు సర్వేరాళ్ళు సిద్ధం చేసి అధికారులకు లక్ష్యం నిర్దేశించారు. వీటిని జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడ నాటగా, మరి కొన్ని చోట్ల రైతుల అభ్యంతరాలతో ఆపేశారు. మరోవైపు వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు తీసుకు వచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ఎన్‌డీఏ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ చట్టం రద్దుకావడంతో భూముల రీసర్వేపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీంతో ఆ రాళ్ళను ఏం చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకున్నారు.

వికటించిన రీ సర్వే

వైసీపీ ప్రభుత్వం వందేళ్ల తరువాత భూముల రీసర్వే తెరపైకి తెచ్చింది. ఇందులో భాగంగా మండలాలు, గ్రామాల వారీగా రీసర్వే పూర్తిచేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఏలూరు రూరల్ మండలంలో రీసర్వే కోసం రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేశారు. మొదటి, రెండో దశ పూర్తిచేసి మూడో విడతలో సగం ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల తరువాత రీసర్వేకు బ్రేక్ పడింది.

జిల్లాలో రెండు లక్షల రాళ్లు

జిల్లాలోని 32 రెవెన్యూ గ్రామాలు రీసర్వే ప్రక్రియ చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 2 లక్షల రాళ్లు సిద్ధం చేశారు. క్షేత్రస్థాయికి ఒక లక్ష చేరగా, సగానికి పైగా రాళ్లు గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని కొందరు స్థానికంగా నిర్మాణాలకు, ఇతర అవసరాలకు తీసుకువెళ్లారు. రాళ్లపై వైఎస్ఆర్ జగనన్న భూరక్ష పేరు రాసి వాటిని క్షేత్రస్థాయికి చేర్చి రెవెన్యూ అధికారులకు అప్పగించే బాధ్యతను క్వారీ యజమానులు తీసుకున్నారు. ప్రభుత్వం కేటగిరిల వారీగా సొమ్ము చెల్లిస్తోంది. మూడేళ్ల పాటు జరిగిన రీసర్వే ఎలా జరిగింది? ప్రస్తుతం రాళ్లను ఏం చేయాలని అధికారులు మదన పడుతున్నారు. గ్రామాల్లో జగన్ రాళ్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. గ్రామ సమీపంలోని పొలాలు, రహదారుల పక్కన రాళ్లు దర్శనమిస్తున్నాయి. రైతుల భూములు హద్దుల్లో అవి కూడా వివాదం లేనిచోట మాత్రమే అక్కడక్కడ రాయి నాటారు. ప్రభుత్వ భూముల గుర్తింపులో కూడా ఇదే పరిస్థితి. రెవెన్యూ అధికారులకు లక్ష్యాలు నిర్దేశించి మరీ రాళ్లు తయారు చేయించారని, వాటిని సకాలంలో తీసుకువెళ్లలేదని, సొమ్ము చెల్లించకపోవడంతో నష్టపోయామని రాళ్లు సరఫరా చేసిన క్వారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో అభ్యంతరాలు

రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూములైన చెరువులు, కుంటలు ఆ విస్తీర్ణం మేరకు లేవు. ఎక్కడచూసినా రైతుల ఆధీనంలోనే సాగులోనే ఉన్నాయి. ఎంజాయ్‌మెంట్‌లో ఉన్న భూమిలో రాళ్లు ఎలా నాటుతారు అనే అభ్యంతరాలు ఉన్నాయి. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎక్కడా కూడా పూర్తిస్థాయిలో రాళ్లు నాటలేదు. కాని చాలాచోట్ల రాళ్లు నాటినట్లు డబ్బులు స్వాహా చేశారని ఆరోపణలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఒక్కో రాయి నాటడానికి ప్రభుత్వం రూ.150 మంజూరు చేసింది. జిల్లా సర్వే అధికారుల నుంచి తహసీల్దార్ల ఖాతాకు రాగా అక్కడి నుంచి మండల సర్వేయర్లకు సొమ్ము చేరినట్లు చెబుతున్నారు.

ఒలింపిక్స్ పతకమే లక్ష్యంగా..



పరుగు తీస్తున్న జ్యోతికశ్రీ

» నాన్న ప్రోత్సహమే కొండంత అండ : అథ్లెట్ దండి జ్యోతికశ్రీ

తణుకు, జూలై 9 : ఆమె పేరు దండి జ్యోతిక శ్రీ. ఈనెల 26 నుంచి పారిస్‌లో జరిగే ఒలింపిక్స్ క్రీడల్లో 4x400 మీటర్ల రిలే పరుగు పందెం పోటీలకు అర్హత సాధించారు. ఈ పోటీల్లో పతకం సాధించడమే తన లక్ష్యమని, ఎలాగైనా సాధించి తీరుతానని ఆమె దృఢంగా విశ్వసిస్తు న్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణా నికి చెందిన ఆమె తల్లి లక్ష్మి, తండ్రి శ్రీనివాసరా వు. 2000 జూలై 16వ తేదీన ఆమె జన్మించారు. తండ్రి బాడీ బిల్డర్. ఆయనే ఆమెకు మొదటి కోచ్. కుమార్తె స్కూల్లో చదువుకునే సమయంలో క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని గుర్తించి జ్యోతిక శ్రీని ప్రోత్సహించారు. ఆమె 13వ ఏట నుంచి శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. తణుకు మాంటిస్సోరి స్కూలులో ప్రాథమిక విద్య పదో తరగతి వరకు చదివింది. ఆమెకు కోచ్ సీతారామయ్య శిక్షణ ఇచ్చారు. స్కూలు యాజమాన్యం జ్యోతిక శ్రీని ప్రోత్సహించడం కలిసి వచ్చింది. విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాలలో ఇంటర్ చదువుతుండగా అక్కడ కోచ్ వినాయక్ ప్రసాద్ సారథ్యంలో మెలకువలు నేర్చుకుంది. తర్వాత హైదరాబాద్ గోపీచంద్ మైత్రా అథ్లెటిక్స్ ప్రాజెక్టులో భాగంగా కోచ్ నాగపురి రమేశ్ వద్ద శిక్షణ తీసుకున్నారు.

ఎన్నో పతకాలు సాధించి..

2017లో ప్రపంచ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో 400 మీటర్ల రిలేలో ప్రాతినిధ్యం వహించింది. 2021లో అండర్-23 మహిళల 400 మీటర్ల పరుగులో నేషనల్ చాంపియన్ షిప్ సాధించింది. 2023లో జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్, ఇండియన్ గ్రాండ్ ప్రి-2, 4 పోటీల్లో బంగారు పతకాలు గెలుచుకుంది. ఆసియన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ వరల్డ్ రిలే చాంపియన్ షిప్‌ల్లో సత్తా చాటి ప్రస్తుత ఒలింపిక్స్‌కి అర్హత సాధించింది.

నాన్న ప్రోత్సాహమే

'ఈ రోజు ఒలిపింక్స్‌లో ఆడేందుకు అర్హత సాధించానంటే ఇది అమ్మ లక్ష్మి, నాన్న శ్రీనివాసరావుల ప్రోత్సాహమే. చిన్నతనం నుంచి నాలో వున్న క్రీడాసక్తిని గుర్తించి నాన్న ఎప్పటికప్పుడు ప్రోత్సహించేవారు. క్రీడాకారుడు కావడం వల్లే అదే స్ఫూర్తితో నేను అథ్లెటిక్ కావాలనుకున్నా. ఆయనే నా మొదటి కోచ్. కొన్నేళ్లుగా దేశం తరపున ఎన్నో పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించాను. ఇప్పుడు నా ముందున్న లక్ష్యం ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే. ఇందు కోసం సిద్ధమవుతున్నా' అని జ్యోతికశ్రీ అన్నారు. 'మా అమ్మాయి ఒలింపిక్స్‌కు ఎంపిక కావడం ఎంతో గర్వకారణంగా వుంది. ఆమె కచ్చితంగా పతకం సాధిస్తుందన్న నమ్మకం వుంది. చిన్న వయసు నుంచి అటు చదువులోను, ఇటు క్రీడల్లోనూ రాణిస్తూ మెరుగైన ఫలితాలు సాధించింది' అని తండ్రి శ్రీనివాసరావు తెలిపారు.

రేపు డీఎల్‌టీసీలో జాబ్‌మేళా

ఏలూరు అర్బన్, జూలై 9 : ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ జిల్లాస్థాయి శిక్షణ సంస్థ (డీఎల్‌టీసీ)లో ఈనెల 11న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ రవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీలు హాజరయ్యే ఈ జాబ్‌మేళాకు ఐటీఐ ఉత్తీర్ణులై, అప్రంటీస్‌షిప్ పూర్తిచేసిన అభ్యర్థుల తోపాటు, ఐటీఐ చివరి సంవత్సరం చదువుతున్న ట్రైనీలు హాజరుకావచ్చున్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఐడీ ప్రూఫ్‌లు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని.. వివరాలకు 89776 18713లో సంప్రదించాలని సూచించారు.

'శ్రేష్ట'లో గురుకుల విద్యార్థికి జాతీయ స్థాయి ర్యాంకు



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

పెదవేగి, జూలై 9:నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ నిర్వహించిన శ్రేష్ట ప్రవేశ పరీక్షలో పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థి లకారపు రిత్విక్ జాతీయస్థాయి ర్యాంకు సాధించాడు. సమిశ్రగూడేనికి చెందిన లకారపు రిత్విక్ ప్రస్తుత విద్యా సంవత్సరంలో పెదవేగిలోని గురుకుల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గతేడాది మేనెలలో కేంద్ర సామాజిక న్యాయం-సాధికార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ద్వారా నిర్వహించిన నేషనల్ ఎంట్రన్స్ టెస్ట్ ఫర్ శ్రేష్ట ప్రవేశ పరీక్షలో జాతీయస్థాయిలో 354వ ర్యాంకు సాధించాడు. రిత్విక్ తండ్రి శ్రీహరి ప్రసాదబాబు ఆర్టీసీ డ్రైవర్‌కాగా, తల్లి సోమాలమ్మ గృహిణి. సోదరి స్నిగ్ధశ్రీ పాలిటెక్నిక్ చదువుతోంది. ఎస్సీ సామాజిక వర్గం విద్యార్థులు కార్పొరేట్ విద్యను అందుకోవడానికి అనువుగా ప్రభుత్వం 2022 విద్యా సంవత్సరంలో శ్రేష్ట పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని విద్యాలయం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. శ్రేష్టలో జాతీయ ర్యాంకు సాధించిన రిత్విక్ కార్పొరేట్ పాఠశాలలో ఉచిత విద్య, వసతి, పూర్తి సౌకర్యాలను అందుకుంటాడన్నారు. రిత్విక్‌ను వైస్ ప్రిన్సిపాల్ వైవీఎస్.ఆచార్యులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

వైజ్ఞానిక స్పృహతోనే దేశాభివృద్ధి సాధ్యం



ధ్రువపత్రాలను అందుకున్న విద్యార్థులతో ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 9 : విద్యార్థులు బాల్యం నుంచే తమ ఆలోచనలకు పదును పెట్టాలని, వైజ్ఞానిక స్పృహతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్, ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయక్త ఆధ్వర్యంలో 'ఇన్‌స్పైర్ మనాక్ మెంటర్‌షిప్- 2024' అనే అంశంపై ఏపీ నిట్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ మంగళవారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకత ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడ తాయన్నారు. నేషనల్ ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ అసోసియేయట్ డాక్టర్ సునీల్ భాస్కర్, సైంటిఫిక్ స్టూడెంట్స్ సొసైటీ ప్రెసిడెంట్ ఎస్.జీ.శ్రీనివాస్, ఎస్‌ఈఆర్‌టీ స్టేట్ నోడల్ ఆఫీసర్లు డాక్టర్ భాగ్యశ్రీ, డాక్టర్ మేరీ మాట్లాడుతూ విద్యార్థుల భాగ సామ్యంతోనే దేశప్రగతి సాధ్యమన్నారు. జాతీయస్థాయికి ఎంపికైన 24 మంది విద్యార్థులు ఆగస్టులో ఢిల్లీలో తమ ఆవిష్కరణలను ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ పి.శంకర్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ శ్రీఫణికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేవీకేలకు కేంద్ర ప్రభుత్వం అధికప్రాధాన్యం

ఉండి జూలై 9: కేంద్ర ప్రభుత్వం కృషి విజ్ఞాన కేంద్రాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి రైతులకు ఎంతగానో మేలు చేస్తుందని ఉండి కేవీకే ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ డాక్టర్ మల్లికా ర్జునరావు అన్నారు. మంగళవారం ఉండిలో స్వర్ణోత్సవ జ్యోతియాత్ర ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉండి కేవీకే నుంచి ఘంటశాలకు స్వర్ణోత్సవ జ్యోతియాత్రను తీసుకుని వెళ్లి అందజేసినట్టు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉండి కేవీకే 1995లో ప్రారంభించి రైతులకు అనేక కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన ఉద్యానం, చేపలు, రొయ్యలు, తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకంవంటి అనేక వృత్తి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కరెంట్ షాక్



విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే ప్రాణాపాయం తప్పదు. ఈ విషయాన్ని గమనించి రైతులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే ఈ ప్రమాదాల కారణంగా ఎందరో చనిపోయారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పూర్తిగా వ్యవసాయ ప్రాంతం కావడంతో తరచూ పొలాల్లో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా పామాయిల్ తోటల్లో గెలలు కోసే సమయంలోనే విద్యుత్ తీగలు తగిలి పలువురు మృత్యువాత పడ్డారు. మరోవైపు ఇళ్లల్లోనూ విద్యుత్ వైరింగ్ సరిగా లేక షార్ట్ సర్క్యూట్ వల్ల మరికొందరు బలయ్యారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

» అనధికారికంగా మరెందరో బలి
» రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు
» కాలం చెల్లిన వైర్లు, స్తంభాలు కారణాలే
» అప్రమత్తత లేక మరికొన్ని ప్రమాదాలు

ఏలూరుసిటీ, జూలై 9 :

విద్యుత్ ప్రమాదాలు ఎప్పుడు, ఎక్కడ, ఏ సమయంలోనైనా జరగవచ్చు. తుఫాన్ల సమయంలో ఈదురుగాలులు వీచి విద్యుత్ తీగలు తెగిన సందర్భంలోను, సాంకేతిక ఇబ్బందులు కారణంగా కండక్టర్లు తెగి రహదారులపై పడినప్పుడు వాటిని తగలడంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. అప్రమత్తంగా లేకపోతే ప్రమాదానికి గురవ్వాల్సిందే. ఎప్పుడో వేసిన విద్యుత్ లైన్లు వేసిన చోట్ల పామాయిల్ తోటలు విరివిగా పెరగటం, వాటి గెలలు కోసే సమయంలో ఆ కోసే వస్తువులు తీగలకు తగలడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలు అరికట్టటానికి విద్యుత్ శాఖ చర్యలు చేపడుతున్నా ప్రమాదాలు జరగటం శోచనీయం. విద్యుత్ వైర్లలో నాణ్యత లోపించిందా అన్న విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి.

ఈ ప్రమాదాల్లో మనుషులే కాదు జంతువులు బలవుతున్నాయి. పంట పొలాల్లో గడ్డి మేసే సమయంలో తెగిపడిన విద్యుత్ తీగలు వల్ల పశువులు మృత్యువాత పడుతున్నాయి.

ఏటా పెరుగుతున్న ప్రమాదాలు..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో విద్యుత్ ప్రమాదాలు ఏటా పెరుగుతూనే ఉన్నాయి. 2021-22లో 54 మంది వ్యక్తులు మృతి చెందగా, 2022-23లో 47 మంది.. 2023-24లో ఇప్పటి వరకు 36 మంది చనిపోయారని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

అందించిన నష్ట పరిహారం ఇలా..

విద్యుత్ ప్రమాదాలు జరిగిన వెంటనే నష్టపరిహారం కోసం అధికారులు కృషి చేస్తారు. కాని పరిహారం రావటానికి జాప్యం జరుగుతూనే ఉంటుంది. 2021 నుంచి 24 సంవత్సరాల మధ్య విద్యుత్ ప్రమాదాల వల్ల 137 మంది వ్యక్తులు మృతి చెందగా వారికి సంబంధించి మొత్తం నష్టపరిహారంగా రూ.2.75 కోట్లు వరకు బాధిత కుటుంబాలకు అందజేశారు. 2021-22లో 54 మంది మృతి చెందగా, రూ.1.64 కోట్ల నష్ట పరిహారం బాధిత కుటుంబాలకు అందజేశారు. 2022-23లో 47 మంది మృతి చెందగా రూ.80.70 లక్షల పరిహారం, 2023-24లో ఇప్పటి వరకు 36 మంది మృతి చెందగా రూ.30.30 లక్షల నష్టపరిహారాన్ని అందజేశారు.

మూడేళ్లలో 137 మంది మృత్యువాత

లెక్కకు రాని ప్రమాదాలు అనేకం..

సాధారణంగా పంట పొలాల్లో విద్యుత్ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఇందులో కొన్ని మాత్రమే లెక్కకు వస్తుంటాయిని, మరికొన్ని ప్రమాదాలు లెక్కల్లో కనిపించవనే విమర్శలు వినిపిస్తుంటాయి. విద్యుత్ అధికారుల నివేదికలకంటే అధికంగానే ప్రమాదాలు జరిగే ఉండవచ్చన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. విద్యుత్ ప్రమాదాలను నివారించడం కోసం అధికారులు ఎప్పటికప్పుడు విద్యుత్ కండక్టర్లను మారుస్తూనే ఉన్నారు. అయినా ప్రమాదాలు జరుగుతున్నాయంటే కారణం ఏమిటో తెలుసుకుని అధికారులు సత్వరం చర్యలు చేపట్టాలని ఉమ్మడి పశ్చిమ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

రైతులకు/ రైతు కూలీలకు సూచనలు..


- వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి మోటార్ స్టార్టర్లు, స్విచ్‌లు ఉన్న ఇనుప బోర్డులకు విధిగా ఎర్తింగ్ చేయాలి. విద్యుత్ షాక్ తగులకుండా ఉండేందుకు 30 ఎంఏ సామర్థ్యం కలిగిన ఆర్‌సీసీబీని మాత్రమే ఉపయోగించాలి.
- పామాయిల్ తోటలలో గెలలు కోసేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. గెలలు కోసే ముందు రైతులు విద్యుత్ సిబ్బందికి తెలపాలి. ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగి పడితే వెంటనే విద్యుత్ కాల్ సెంటర్ నంబరు 1912కు ఫోన్ ద్వారా తెలపాలి.
- ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించే ప్రయత్నంలో చేతులతో తాకకుండా ఎండుకర్రతో విద్యుత్ తీగను ప్రమాదానికి గురైన వ్యక్తి నుంచి వేరుచేయాలి. ఇన్సులేషన్ పాడైన విద్యుత్ వైర్లను ఇన్సులేషన్ టేప్‌తో మాత్రమే చుట్టాలి.

గృహ వినియోగదారులకు సూచనలు

- ఇంటికి ఎర్తింగ్ ఇచ్చినప్పుడు కనీసం రెండు ఎర్త్ ఎలక్ట్రోడ్‌లను అమర్చాలి. అసాధారణ శబ్దాలు గ్రైండర్, ఏసీ, రిఫ్రిజిరేటర్‌లో వచ్చి నప్పుడు అశ్రద్ధ చేయకుండా వెంటనే నైపుణ్యం కలిగిన వారి చేత పరీక్షించాలి.
- ఒకే ప్లగ్ పాయింట్ నుంచి లూజ్‌వైర్లు/ టెంపరరీగా అనేకమైన పరికరాలను కలపకూడదు. ప్లగ్‌ను తీయునప్పుడు వైరును లాగరాదు. ఇళ్ళల్లో 30ఎమ్ యాంప్ సామర్థ్యం కలిగిన ఆర్‌సీసీబీ/ ఈఎల్‌సీబీలను వినియోగించుకోవాలి.

వాణిజ్య/పరిశ్రమల వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- కరెంటుకు సంబంధించిన ఏ పని చేసేటప్పుడైనా విధిగా చెప్పులు, చేతి తొడుగులు ధరించి చేయాలి. కాటన్ మిల్స్ వారు ప్యానల్ బోర్డు మీద మోటార్ల మీద కాటన్ డస్టు పార్టికల్స్ లోనికి వెళ్ళకుండా తగు జాగ్రత్త వహించాలి. అన్ని స్విచ్ బోర్డులకు పానెల్ బోర్డులు ముందు రబ్బరు మాట్లు విధిగా ఏర్పాటు చేయాలి.



పోలవరం దిగువ కాఫర్ డ్యాం వద్ద గోదావరి జలాల ఉధృతి



పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్ద నీటి పరవళ్లు

నిలకడగా గోదావరి

పోలవరం, జూలై 9 : పోలవరంలో గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి నిలకడగా మారింది. స్పిల్వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల స్పిల్వేలో సాధారణ నీటిమట్టం నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.520 మీటర్లు, స్పిల్వే దిగువన 16.540 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 26.580 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 15.400 మీటర్లు నమోదైనట్టు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 6,018 క్యూసెక్కుల విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వలకు విడుదల చేశామని పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు మంగళవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 14.802 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 17 పంపులు 17 మోటార్లతో నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. ఈనెలలో ఇప్పటివరకు 2.4060 టీఎంసీల నీటిని విడుదల చేశామన్నారు.



జిల్లా కలెక్టర్‌ను కలిసి నూతన న్యాయమూర్తులు

కలెక్టర్‌ను కలసిన నూతన న్యాయమూర్తులు

ఏలూరు క్రైం, జూలై 9 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వివిధ కోర్టులలో నియమించబడిన నూతన న్యాయమూర్తులు మంగళవారం ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ కోర్టులలో నియమించబడిన న్యాయమూర్తులు పీవీ నాగరంజిత్‌కుమార్ (తణుకు), కాళహస్తి రాజరాజేశ్వరి తేజస్వి (జంగారెడ్డిగూడెం), వీఎస్ఎన్ లక్ష్మీ లావణ్య (పాలకొల్లు), బండి రచన (ఏలూరు)లు ఉన్నారు. అనంతరం రెవెన్యూ అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో న్యాయమూర్తులు పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారిణి డి.పుష్పమణి, ఏలూరు రెవెన్యూ డివిజినల్ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరల తగ్గింపునకు సహకరిస్తాం

» మంత్రి నాదెండ్లను కలసిన చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు



మంత్రి నాదెండ్లను సత్కరిస్తున్న ఛాంబర్స్, కామర్స్ నాయకులు

ఏలూరు రూరల్, జూలై 9: నిత్యావసరాలైన కందిపప్పు, బియ్యం, తక్కువ ధరకు ప్రజలకు అందించేందుకు సహకరిస్తామని వెస్ట్ గోదావరి అసోసియేటెడ్ మర్చంట్స్ చాంబర్ ఏలూరు, వెస్ట్ గోదావరి ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్స్, కామర్స్ ఇండస్ట్రీ నాయకులు మంత్రి నాదెండ్ల మనోహర్‌కు హామీ ఇచ్చారు. మంగళవారం అమరావతిలో మంత్రి నాదెండ్లను వారు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ప్రజలకు నిత్యావసరాలైన కందిపప్పు, బియ్యం ఎక్కువ ధరలు ఉన్నందువల్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బజారులో రేషన్‌కార్డులు ద్వారా నాణ్యమైన ధరలకు విక్రయించేందుకు వర్తకులు, రైస్‌మిల్లర్లు సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి వారిని కోరారు. ఏపీ సివిల్‌సప్లై ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల ధరలపై వర్తక సమావేశం జరిగింది. సమావేశానికి ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు హాజరయ్యారు. అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కర్‌రావు, అన్నిజిల్లాల వర్తక ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్దేశించిన కేజీ కందిపప్పు రూ.160, బియ్యం ఒక రకం రూ.49, మరోరకం రూ.48 చొప్పున ప్రత్యేక కౌంటర్ ద్వారా అమ్మేందుకు సహకరిస్తారని మంత్రికి స్పష్టం చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఛాంబర్ ప్రధాన కార్యదర్శి వంకాయల రామకృష్ణ, దాల్ మిల్లర్స్ తరపున మద్దుల సత్యకుమార్, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు వ్యాపారులు సహకరించాలి

» పశ్చిమ గోదావరి జిల్లా జేసీ ప్రవీణ్ ఆదిత్య

భీమవరంటౌన్, జూలై 9 : బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు వర్తకులు సహకారం అందించుటకు ముందుకు రావాలని జిల్లా జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయం వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులు, రిటైల్ అమ్మకందారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువులు ధర స్థిరీకరణపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్ని రైతు బజార్లు, డీ-మార్టు, రిలయన్స్ సూపరుమార్కెట్ల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, ధరల వివరాలు అందరికీ కనబడేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. బియ్యం, కందిపప్పును ప్రజానీకానికి మార్కెటు ధరల కంటే తక్కువ ధరకు అమ్మకాలు చేయాలన్నారు. దీనికి అవసరమైన చర్యలను చేపట్టేందుకు మార్కెటింగు, సివిల్ సప్లై శాఖ, రైస్, పప్పులు, ఆయిల్, కూరగాయలు, రిటైల్ వ్యాపారస్తులకు ఉల్లి, టమాట ధరలు నియంత్రణకు చేపట్టవలసిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వేంకటేశ్వరరావు, డీఎస్‌వో యన్.సరోజ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణలో ఎన్యూమరేషన్ కచ్చితంగా ఉండాలి

జాతీయ రహదారుల భూసేకరణలో ఎన్యుమరేషన్ ఖచ్చితత్వంతో నిర్వహించాలని జేసీ ప్రవీణ్‌ఆదిత్య సర్వే అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో సర్వే అధికారులతో ఆయన సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవేస్ భూసేకరణలో భాగంగా ఆయా భూముల్లో ఉన్న ఇళ్ళు, షెడ్లు, చెట్లు వంటి వాటిని కచ్చితంగా లెక్కించాలన్నారు.

మూడేళ్ల తర్వాత తల్లి చెంతకు బాలుడు

» అధికారులను అభినందించిన కలెక్టర్ వెట్రిసెల్వి



తప్పిపోయిన బాలుడు నందకిషోర్‌ను తల్లికి అప్పగించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు క్రైం/ బుట్టాయగూడెం, జూలై 9 : ఇంటి నుంచి మూడేళ్ల క్రితం వెళ్లిన గిరిజన బాలుడు తల్లి చెంతకు చేరుకున్న ఘటన మంగళవారం జరిగింది. ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బాలుడిని తల్లికి అప్పగించారు. బుట్టాయగూడెం మండలం మర్లగూ డెంకు చెందిన కొవ్వాసి మహాలక్ష్మి, శ్రీను దంపతుల కుమారుడు కొవ్వాసి నందకిషోర్. మూడేళ్ల క్రితం జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఐదో తరగతిలో తల్లిదండ్రులు చేర్చారు. చదువుపై ఇష్టంలేని బాలుడు కొన్ని రోజుల తర్వాత ఇంటికి వచ్చి.. తర్వాత ఇంటి నుంచి 2021లో పారిపోయాడు. గతంలో పలుమార్లు పారిపోయిన బాలుడు ఇంటికి వచ్చే అలవాటు ఉండడంతో ఈసారి కూడా ఇంటికి వస్తాడని ఆశించిన తల్లికి నిరాశే మిగిలింది. ఎట్టకేలకు వారం రోజుల క్రితం ఆ పన్నెండేళ్ల బాలుడు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హౌరా రైల్వేస్టేషన్‌లో ఉన్నట్టు అక్కడ సీడబ్ల్యూసీ ద్వారా ఏలూరు డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌కు సమాచారం అందింది. స్పందించిన ఐసీడీఎస్ అధికారిణుల ఆదేశాల మేరకు బుట్టాయగూడెం ఐసీడీఎస్ సిబ్బందితో సంప్రదించి తల్లితో ఆ బాలుడిని వీడియో కాల్ ద్వారా మాట్లాడించి గుర్తించారు. ఆమె తన కుమారుడిని తీసుకురావాలని కోరడంతో ఈనెల ఎనిమిదో తేదీన ఏలూరు జిల్లా కేంద్రానికి రప్పించారు. మంగళవారం కలెక్టర్ సమక్షంలో అతడిని తల్లి మహాలక్ష్మికి అప్పగించారు. సుదీర్ఘ కాలంగా దూరమైన కొడుకు అధికారుల కృషి వల్ల తిరిగి తన వద్దకు చేరడంతో ఆ తల్లి ఎంతో సంతోషపడింది. బాలుడి వివరాలు గుర్తించి క్షేమంగా తల్లికి అందించిన ఏలూరు జిల్లా డీసీపీవో, ఐసీడీఎస్ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో పీడీ పీవీఎల్ పద్మావతి, బాలల సంరక్షణ అధికారి సూర్యచక్రవేణి, సీడీపీవో తులసీ, కేర్ ఆఫీసర్ సీహెచ్ శ్రీకాంత్, సూపర్‌వైజర్ కె.రూప్సీ తదితరులు పాల్గొన్నారు.

వరాహావతారంలో జగన్నాథుడు



వరాహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల, జూలై 9 : శ్రీజగన్నాథుని రథోత్సవాల్లో భాగంగా జరుగుతున్న అలంకార మహోత్సవాలు భక్తులను అలరిస్తున్నాయి. ఈశ్ర మంలో లక్ష్మీసమేతంగా కొలువై శంఖు చక్రాలను ధరించి అభయహస్తాన్ని ప్రసాదిస్తూ.. వరాహావతారంగా స్వామివారు మంగళవారం భక్తులను అనుగ్రహించారు. పురాతన లక్ష్మీపురం ఆలయ ప్రాంగణంలోని మండపంలో జగన్నాథుడు రోజుకో అలంకరణలో సాక్షాత్కరిస్తున్నారు, వరాహ రూపంలో ఉన్న స్వామిని భక్తులు దర్శించి తరించారు.

డబ్బులివ్వలేదని నగల కోసం మహిళ హత్య

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 9: తాడేపల్లిగూడెం మండలం అరుళ్లలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఆరుగొలనుకు చెందిన జానపాముల సత్యవతి(45)ని నగల కోసం హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. పట్టణ పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలివి.. ఆరుగొలనుకు చెందిన సత్యవతికి అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ చిక్కాల శ్రీనుకొండయ్యకు గత పదేళ్లగా పరిచయం ఉంది. ఆమె ఈనెల ఒకటో తేదీన ఆటోలో బంధువుల ఇంటిలో ఫంక్షన్‌కు వెళ్లగా.. అతడు మాట్లాడే పనుందని తాడేపల్లిగూడెం రమ్మన్నాడు. ఆమె దర్శిపర్రు నుంచి తాడేపల్లిగూడెంలో దిగి శ్రీనుకొండయ్యతో కలిసి నవాబుపాలెం వెళ్లింది. అతడు తనకు అర్జెంటుగా రూ.10వేలు కావాలని అడగగా తన దగ్గర డబ్బులు లేవని ఆమె చెప్పడంతో మెడలో నగలను చూసి వాటిపై కన్నేసి నిడదవోలు వెళ్దామని చెప్పి బైక్‌పై అరుళ్ల గ్రామానికి తీసుకెళ్లాడు. అక్కడ మళ్లీ డబ్బులు ఇవ్వాలని గొడవకు దిగగా.. ఆమె వారించడంతో పక్కనే ఉన్న కాల్వ తుప్పల్లోకి నెట్టి గొంతు నులిమి హత్యచేశాడు. అనంతరం ఆమె మెడలోని నగలు తీసుకుని పరారయ్యాడు. సత్యవతి కనిపించడంలేదని బంధువుల ఫిర్యాదుతో సీఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా సెల్‌ఫోన్ ఆధారంగా అతడిపై అనుమానంతో విచారించగా అసలు విషయం బయటపెట్టాడు. ఈ మేరకు హత్యకేసుగా నమోదు చేసి అతడిని అరెస్టు చేశామని సీఐ సుబ్రహ్మణ్యం వివరించారు.

క్రైం కార్నర్

మద్యం తాగొద్దన్నందుకు..

» తల్లి, చెల్లి, బావ, అమ్మమ్మపై కత్తితో కుమారుడి దాడి
» బుట్టాయగూడెం సీహెచ్‌సీలో చికిత్స



ఆసుపత్రిలో బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

బుట్టాయగూడెం, జూలై 9 :చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని.. మద్యం తాగొద్దని వారించినందుకు తల్లి, చెల్లి, బావ, అమ్మమ్మలపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన సోమవారం అర్ధరాత్రి బుట్టాయగూడెం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. అచ్చియ్యపాలెంకు చెందిన ములపర్తి పద్మకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం పద్మ వద్ద కుమార్తె దివ్య కుమారుడు రాజు, తల్లి చిడిపి దుర్గమ్మ ఉంటున్నారు. ఏలేటి చంద్రశేఖర్‌తో స్నేహం చేస్తూ రాజు చెడు అలవాట్లకు బానిసయ్యాడు. వ్యసనాలకు దూరంగా ఉండాలని తల్లి మందలించడంతో పలుమార్లు చంపుతానని బెదించేవాడు. సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లి మందలించింది. మద్యం మత్తులో ఉన్న అతడు కుటుంబ సభ్యులపై గొడవకు దిగాడు. అనంతరం అతడి స్నేహితుడు ఏలేటి చంద్రశేఖర్ అలియాస్ చంటితో కలిసి ముందుగా వేసుకున్న పథకం ప్రకారం నలుగురు కళ్లల్లో కారం చల్లి చాకుతో విచక్షణ రహితంగా దాడిచేయడంతో తల్లి, చెల్లి, బావ, అమ్మమ్మలకు గాయాలయ్యాయి. గాయపడినవారిని 108లో బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా డాక్టరు హేమంత్‌కుమార్ బాధితులకు చికిత్స చేశారు. బాధితురాలి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకన్న తెలిపారు.

వెనుక నుంచి మోటారు సైకిల్ ఢీ.. ఒకరి మృతి



పద్మారావు (ఫైల్)

పెనుగొండ, జూలై 9 : మోటారు సైకిల్ ఢీ కొన్న ప్రమాదంలో సైకిలిస్టు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, పెనుగొండ పోలీసులు తెలిపిన వివరాలివి.. సిద్ధాంతం గ్రామానికి చెందిన సలాది పద్మారావు(85) అనే వ్యక్తి సోమవారం రాత్రి సిద్ధాంతం భారత్ పెట్రోల్‌బంక్ సమీపం నుంచి సైకిల్‌పై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన మోటారు సైకిల్ వేగంగా ఢీ కొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో తణుకు ఆసుపత్రికి తరలిం చినట్లు తెలిపారు. మార్గమధ్యలో పద్మారావు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, జూలై 9 : రోడ్డు దాటుతున్న ఒక వృద్ధురాలిని అతి వేగంగా వెళ్తున్న మోటారుసైకిలిస్టు ఢీ కొనడంతో ఆమె మృతి చెందింది. ఏలూరులోని చిట్టివలసపాకలకు చెందిన చిరంది సత్యవతి(80) ఏలూరు లోబ్రిడ్జి వద్ద మొక్కజొన్న పొత్తులు కాల్చి విక్రయిస్తూ జీవితం గడుపుతుంది. మంగళవారం మధ్యాహ్నం ఏలూరు వసంతమహల్ వద్ద రోడ్డు దాటుతుండగా ఓ గుర్తుతెలియని మోటారు సైకిలిస్టు అతివేగంగా ఢీకొని వెళ్ళిపోయాడు. తీవ్ర గాయాలైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

మద్యం బాటిల్స్ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

ఏలూరు క్రైం, జూలై 9 : అధిక మొత్తంలో మద్యం బాటిల్స్‌ను మోటారు సైకిల్‌పై తీసుకువెళ్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు వంగాయిగూడెం సెంటర్‌లో మంగళవారం రాత్రి ఎస్ఐ నవీన్‌కుమార్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామానికి చెందిన బండారు నాగేంద్రబాబు మోటారు సైకిల్‌పై అనుమానాస్పదంగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతడి వద్ద 215 మద్యం బాటిల్స్ ఉండడాన్ని గుర్తించి అరెస్టు చేశారు. ఎందుకు, ఎక్కడకు తీసుకువెళ్తున్నాడనే దానిపై దర్యాప్తు చేపట్టారు.

అన్ని రంగాల్లోనూ రాణించాలి

ద్వారకాతిరుమల, జూలై 9: ప్రభుత్వ పాఠ శాలల్లో చదివే విద్యార్థులు ఏకాగ్రతను పెంచుకుని చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణిస్తేనే మంచి గుర్తింపు ఉంటుందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని పంగిడిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు 400 మంది విద్యార్థులకు మంగళవారం స్కూల్ బ్యాగ్స్, పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక్క చదువులోనే కాకుండా క్రీడలపై ఆసక్తి కనబరిచి ప్రతిభ చాటాలన్నారు. కూటమి నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పెదవేగి : పుస్తక పరిజ్ఞానం పొందితే అంతకుమించిన గొప్ప జ్ఞానం మరొకటి ఉండదని నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య అన్నారు. విజయరాయి, రాయన్నపాలెం, గార్లమడుగు పాఠశాలల్లో విద్యార్థులకు డీఎస్పీ 'మన భావి భారత పౌరులు- మన పుస్తకాలు' అనే విజ్ఞానదాయక పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఒక పుస్తకం మనవెంట ఉంటే అంతకు మించిన స్నేహితుడు ఉండరన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వెళ్లడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు.

వేతనాలు పెంచాలని ఎమ్మెల్యే బాలరాజుకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

కుక్కునూరు, జూలై 9: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో గర్భిణులకు, బాలింతలకు చిన్నారులకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలందిస్తున్నారు. అయినప్పటికి వారికి తగిన వేతనాలు అందడం లేదని సీఐటీయూ మండల కార్యదర్శి సాయికిరణ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వ సమయంలో 42 రోజులపాటు అంగన్‌వాడీలు సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేశారన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగ స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సీఐటీయూ నాయకులు దుర్గారావు, కొండల రావు, తెల్లం దుర్గారావు, లత, అన్నపూర్ణ, మంగా, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి : వలంటీర్లు

పోలవరం జూలై 9 : ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్లు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో, సచివాలయంలో మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. వలంటీర్లు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా పని చేశామన్నారు. కరోనా కష్ట కాలంలో, వరదల సమయాలలో ఎన్నో సేవలందించామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా తమను విధుల్లో కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలని, గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు.

విష జ్వరాలు ప్రభలకుండా చర్యలు చేపట్టండి

బుట్టాయగూడెం, జులై 9 : ఏజెన్సీలో విషజ్వరాలు ప్రభలకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం మండల కమిటీ ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేసింది. బుట్టాయగూడెంలో మంగళవారం కోరసా జలపాలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ జ్వరాల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. జ్వరాలతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామంలోని జూనియర్ కళాశాలకు అనుబంధంగా నడుస్తున్న వసతి గృహానికి అదనపు భవనాలు నిర్మించాలన్నారు. నాయకులు పోలోజు నాగేశ్వరావు, అందుగుల ఫ్రాన్సిస్, మొడియం నాగమణి, వీరయ్య, రాజు, వెంకటలక్ష్మీ, బుల్లెమ్మ, నరేంద్ర పాల్గొన్నారు.

బ్యారన్‌కి రూ.9 లక్షల రుణం ఇవ్వండి


అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

జంగారెడ్డిగూడెం, జూలై 9 : వర్జీనియా పొగాకు రైతులకు పంట ఉత్పత్తి వ్యయానికి తగినట్లు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రాల రైతు సంఘ నాయకులు మంగళవారం పట్టణంలోని బ్యాంకు అధికారులకు వినతులు అందజేశారు. 2023-24 సీజన్‌లో రైతులకు ఎకరానికి సుమారు రూ. మూడు లక్షలు ఖర్చు అయ్యిందని, రాబోయే సీజన్‌కి మరింత వ్యయం పెరిగే అవకాశం ఉండడంతో ప్రతి బ్యారన్‌కి రూ. తొమ్మిది లక్షల రుణం మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు విజ్ఞప్తి చేశారు. రైతు సంఘ అధ్యక్షుడు సత్రం వెంకట్రావు, నాయకులు అట్లూరి సతీష్, వీవీఎస్ ప్రకాశరావు, వామిశెట్టి హరిబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు

భీమడోలు, జూలై 9 : పోలసానపల్లిలో పూడికతీత పనులను పంచాయతీ అధికారులు చేపట్టారు. భీమడోలు జంక్షన్ సమీపంలో వర్షం నీరు వెళ్లేందుకు డ్రెయిన్ తూరలకు అడ్డుపడిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. డ్రెయిన్లలో పేరుకుపోయిన మట్టి, ఇతర వ్యర్థాలను తొలగించినట్లు ఈవోఆర్డీ సుందరి తెలిపారు. అలాగే నీరు నిల్వ లేకుండా చూడాలని, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ వాహనాలకు అందజేయాలని సూచించారు. పాలిథిన్ కవర్లపై నిషేధం ఉన్న కారణంగా ఎవ్వరు ఉపయోగించవద్దని అన్నారు. గ్రామంలో మానవహారం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, సర్పంచ్ రహీమా బేగమ్, తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేయండి

ఏలూరు కార్పొరేషన్, జూలై 9 :ఏలూరు నగరంలోని పలు కాలనీల్లో అధ్వానంగా ఉన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య అధికారులకు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. డ్రెయినేజీలలో పూడిక తీయకపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. దీంతో దోమలు పెరిగి ప్రజలు అంటువ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

చింతలపూడిలో భారీ వర్షం

చింతలపూడి, జూలై 9: మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పైగా కుండపోతగా వర్షం కురవడంతో మెట్ట ప్రాంతంలోని చెరువుల్లోకి నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ రూ.6 వేలు ఇచ్చి ఆదుకోండి

టి.నరసాపురం, జూలై 9: రంగస్థల కళాకారులకు రూ.ఆరు వేల పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ, తెలుగు నాటక రంగ సంస్థ కళాకారుడు తిరుపతి రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో వందలాది మంది కళాకారులు వివిధ రూపాల్లో కళలను ప్రదర్శించి వృద్ధాప్యంలో అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారని అన్నారు. రూ.నాలుగు వేల పింఛన్ వృద్ధ కళాకారులకు వైద్య ఖర్చులు కూడా సరిపోవడం లేదని వారు వాపోయారు. నిరు పేద వృద్ధ కళాకారులకు రూ.ఆరు వేల పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు


పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద చిన్నపాటి చెరువును తలపిస్తున్న రహదారి

జంగారెడ్డిగూడెం, జూలై 9 : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని పలు ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ప్రధాన రహదారిపై గుంత ఏర్పడి నీరు నిలిచి పోయింది. దీంతో ప్రయాణికులు పడుతూ లేగుస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. ఏలూరు రోడ్‌లోని శివ శంకర్ ఆసుపత్రి వద్ద పడిన గోతిలో వర్షపు నీరు నిలిచిపోయింది. ఏలూరు వెళ్లడానికి ఇది ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు ఇటుగా వస్తుంటాయి. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి పట్టణంలోని ప్రధాన రహదారుల్లో గోతులను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.


ద్వారకా తిరుమల మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్


ఇసుక పంపిణీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎమ్మెల్యేలు రోషన్, వెంకట్రాజు, ప్రభాకర్

లింగపాలెం , జూలై 9 : ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ వారి అవసరాలు తీర్చేలా చర్యలు తీసుకోవాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ధర్మాజిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మంగళవారం వెళుతూ గోతులతో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి గుంతలను పూడ్చేలా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. చింతలపూడి నుంచి ఏలూరు వైపు వెళ్లే ప్రయాణికులు ఈ మార్గంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే తన సొంత నిధులతో అప్పటికప్పుడు రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రోషన్ కుమార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన ఎంతో మంది ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. కళాశాలలో అధ్యాపకుల కొరత లేకుండా చూస్తానన్నారు. ప్రిన్సిపాల్ సుష్మకౌముది, కూటమి నేతలు గారపాటి బుజ్జియ్య, మోరంపూడి ప్రసాద్, పాతూరి శ్రీనివాసరావు, గారపాటి సాయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ పాలకులు ఇసుక దండుకున్నారు

చింతలపూడి : గత వైసీపీ పాలకులు ఇసుక ద్వారా రూ.50 వేల కోట్లకు పైగా సంపాదించుకున్నారని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఉచిత ఇసుక పాలసీని చింతలపూడిలో జెండా ఊపి ప్రారంభించారు. ఆ ఇసుక సుమారు రూ.10 లక్షల ఇళ్లకు సరిపోతుందన్నారు అయితే ఎన్‌డీఏ ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ అమలు చేయటమే కాక, అక్రమాలకు తావులేకుండా జిల్లా స్థాయిలో కమిటీ వేసి పర్యవేక్షిస్తారన్నారు. ఇచ్చిన హామీని నెలలోనే అమలులోకి తీసుకువచ్చిన చంద్రబాబు, మోదీ, పవన్‌కల్యాణ్, లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. కూటమి నాయకులు కనమతరెడ్డి రాజారెడ్డి, అట్లూరి శ్రీనివాసరావు, పక్కాల వెంకటేశ్వరరావు, ధర్మరాజు, కె.శేషగిరిరావు, టీఎస్‌వీ కుమార్, టి.వెంకటనారాయణ పాల్గొన్నారు.

రాజీ పడకుండా పని చేయాలి

ద్వారకా తిరుమల : ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు రాజీ పడకుండా అధికారులు పనిచేయాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బొండాడ మోహినీవెంకన్నబాబు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. పలు శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టాలను, కన్నీళ్లను చూసి తాను ఈ స్థానంలో ఉన్నానని, రాబోవు తరాలకు సైతం గుర్తుండేలా వ్యవస్థలో స్పష్టమైన మార్పులు తీసుకుని రావాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాలను ఎలా అభివృద్ధి చేయాలని అనే ఆలోచనతో ముందుకు వెళ్లాలని సూచించారు. జడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్, మండల అధికారులు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి : ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు సమస్యలతో సహజీవనం చేశారని ఇకపై సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు దుగ్గిరాల కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే ప్రభాకర్‌ను కలసి, సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అసమర్థపాలనతో ప్రజలు నిత్యం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. చంద్రబాబు నాయకత్వంలో మేలు జరుగుతుందనే నమ్మకం ప్రజల్లో కలిగిందని, వారి నమ్మకానికి అనుగుణంగా ప్రజాపాలన ఉంటుందని ప్రభాకర్ తెలిపారు. సమస్యలకు సత్వరం పరిష్కారం చూపితే అంతకు మించి మరొకటి ప్రజలు కోరుకోరని, ఆ దిశగా తనవంతు కృషిని అందిస్తానని ప్రభాకర్ పేర్కొన్నారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, ఎస్‌నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ అవకాశం ఇవ్వండి


ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణ

కామవరపుకోట, జూలై 9 : చింతలపూడి నియోజకవర్గ వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని కామవరపుకోట మండల టీడీపీ అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ టీడీపీ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి నియోజకవర్గ సీనియర్ నాయకుల సూచనల మేరకు కృషి చేశానన్నారు. బాదుడే బాదుడు, బాబుతో నేను, బాబూ షూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ, సూపర్-6 పథకాలు, కొత్త ఓటర్ల చేరిక, పార్టీ సభ్యత్వ నమోదు, గ్రామాల్లో సభలు నిర్వహించి లక్ష్యాలను అధిగమించానన్నారు. తన సేవలను గుర్తించి చింతలపూడి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని కోరారు. కిలారు ఖాన్ వజీర్, వందనపు లక్ష్మణరావు, బేతిన వెంకట్రావు, కంఠమనేని అంజిమూర్తి, వందనపు మురళీ, మరీదు వెంకట్రావు తదితరులు ఉన్నారు.

కౌలు హక్కు పత్రాలు తప్పనిసరి

పోలవరం జూలై 9 : రైతులు కౌలు హక్కు పత్రాలు (సీసీఆర్‌సీ కార్డులు) తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్డీవో అద్దయ్య తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో మండల రెవెన్యూ, రైతు సేవా కేంద్రం సిబ్బందితో మంగళవారం జరిగిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. సాగుకి తీసుకుని వ్యవసాయం చేస్తున్న రైతులు సాగు వివరాలు తెలిపి కౌలు హక్కు పత్రాలు పొందాలన్నారు. ఈ పత్రాల కాల పరిమితి 11 నెలలని, ఈ పత్రాల వలన భూమి యజమానులకు ఎటువంటి ఇబ్బందులు ఉండన్నారు, కౌలు రైతులకు వారు పండించే పంటపైనే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. పంటకు మద్దతు ధర, రుణం, పెట్టుబడి రాయితీ, బీమా వంటివి నేరుగా కౌలు రైతులకు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కౌలు రైతులు దరఖాస్తు చేసుకుంటే ఈ నెల 11, 12 తేదీలలో సమీప రైతు కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతులను గుర్తించి పత్రాలు మంజూరు చేస్తామన్నారు. తహసీల్దారు జీవీ ప్రసాద్, ఎంఈవో కె.రాంబాబు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఉచిత ఇసుక


ఇసుకు రవాణాకు లారీలను ప్రారంభిస్తున్న వెంకటరత్నం

ఏలూరు టూ టౌన్, జూలై 9: పేదలకు అందుబాటులో ఉండే విధంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తెచ్చిన ఘనత టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికే దక్కుతుందని మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం అన్నారు. ఏలూరులో ఇసుక రీచ్‌లు, ఇసుక స్టాక్ పాయింట్ల వద్దకు బయల్దేరిన లారీలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ పేదలు భవన నిర్మాణ కార్మికులకు మేలు జరిగే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శ్రీకారం చుట్టారన్నారు. వైసీపీ కొండలు, గుట్టలు, నదులు, వాగులలోని ఇసుకను దోచేసిందన్నారు. రెడ్డి నాగరాజు, అమరావతి అశోక్, బాలజీ, గంగరాజు పాల్గొన్నారు.

ఇసుక డిపోల నుంచి జోరుగా విక్రయాలు

కుక్కునూరు : ఇబ్రహీంపేట, వింజరం ఇసుక డిపోల నుంచి మంగళవారం జోరుగా విక్రయాలు జరిగాయి. ఇబ్రహీంపేట ఇసుక డిపో నుంచి 246 మెట్రిక్ టన్నులు, వింజరం ఇసుక డిపో నుంచి 79 మెట్రిక్ టన్నుల ఇసుక అమ్మకాలు జరిగాయి. ఇబ్రహీంపేటలో మెట్రిక్ టన్ను ఇసుక రూ.210, వింజరంలో మెట్రిక్ టన్ను ఇసుక రూ.362లకు విక్రయించారు. రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణలో ఇసుక అమ్మకాలు జరిగాయి. తహసీల్దార్ అచ్యుతకుమారి ఇసుక డిపోను పర్యవేక్షించారు.

ఉచిత ఇసుక విధానంపై హర్షం

భీమడోలు : ఉచిత ఇసుక విధానంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ నేతలు అన్నారు. మాజీ ఎమ్మెల్యే గన్ని కార్యాలయంలో టీడీపీ నేతలు నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇసుక మాఫియా నడిపిందన్నారు. ఇసుక కుంభకోణంలో రూ.50 వేల కోట్లు కొల్లగొట్టారని విమర్శించారు. గృహ నిర్మాణ శాఖకు ఇసుక సరఫరా పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ కో మింగేశారని విమర్శించారు. వైసీపీ నేతలు మింగేసిన ఇసుకతో దాదాపు పది లక్షల ఇళ్లు కట్టవచ్చన్నారు. పార్టీ నేతలు దూసనపూడి పుల్లయ్యనాయుడు, కరణం పెద్దిరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన పెంచుకోవాలి

ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

ఏలూరు రూరల్, జూలై 9: గ్రామ, జిల్లా స్థాయి వరకు అంగన్‌వాడీ కార్యకర్త నుంచి సూపర్‌వైజర్లు, బాలల హక్కులు, వారి రక్షణ, సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో చైల్డ్ రైట్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సహకారంతో బాలలకు అవసరమైన సంరక్షణ, రక్షణ, బాలల సంక్షేమ సమితి వారి దగ్గరకు ఎలా పంపించాలి అనే అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ విధి విధానాలను తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో రక్షణ, సంరక్షణకు అవసరమైన బాలలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మండల స్థాయిలో సీడీపీవో ఆధ్వర్యంలో జరిగే సెక్టార్ సమావేశాల్లో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ పద్మావతి, చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ పి.ఫ్రాన్సిస్ తంబి, సభ్యులు హైమావతి, క్రాఫ్ జిల్లా కో ఆర్డినేటర్ రవిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన

ఏలూరు అర్బన్ : అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో సీఆర్‌ఆర్ పార్మసీ కళాశాలలో 'డ్రగ్స్ ఫ్రీ సూపర్ హీరో' సెల్ఫీ కాంటెస్ట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉన్నతమైన భవిష్యత్తును ఆశించే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్తును నాశనంచేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వాడితే కఠిన శిక్షలు, జరిమానాలు ఉంటాయని హెచ్చరించారు. నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ ప్రియాంక మాట్లాడుతూ ఈ నెల 10 వరకు ఏలూరు, పరిసర ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలల్లో వివిధ కార్యక్రమాలతో మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. కళాశాల కరస్పాండెంట్ మాగంటి రాజారామ్మోహన్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రబాబు, బాలభవన్ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు


గోదావరి కాలువలో తొలగిస్తున్న గుర్రపు డెక్క

దెందులూరు, జూలై 9 : పోతునూరు, ఉండ్రాజవరం, కొవ్వలి, దోసపాడు, దెందులూరు, సత్యనారాయణపురం గ్రామాల పరిధిలో వ్యవసాయ పనులు, వరి ఊడ్పులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో గోదావరి కాలువలో గుర్రపు డెక్క, తుడు, తుక్కు అడ్డుపడడంతో సాగునీరు ముందుకు సాగడం లేదు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గోదావరి కాలువలో అడ్డంకులను తొలగించి, నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో రెండు రోజులుగా సత్యనారాయణపురం-ఉండ్రాజవరం అడ్డ రోడ్డు సమీపంలో గోదావరి కాలు వలోని గుర్రుపు డెక్కను తొలగించే పనులు కూలీలు, యంత్రాలతో ముమ్మరంగా జరుగుతుండడంతో సాగు నీటి వేగం పెరిగింది. దీంతో రైతులు వరి ఊడ్పులను ముమ్మరం చేశారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జులై 9 : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారుల మార్జిన్లు బురదమయంగా మారాయి. ఈ నేపథ్యంలో చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా మార్గ మధ్యలో పెదపాడు శివారు ప్రాంతంలో ఐషర్ వాహనం మంగళవారం బురదలో కూరుకు పోయింది. సమాచారం అందుకున్న పెదపాడు పోలీసులు వాహనాన్ని, వాహనంలోని కోళ్ల వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. వాహనం, చెరువు యజమానులు, వాహన డ్రైవర్‌పై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కె.శుభశేఖర్ తెలిపారు.

ఆధ్యాత్మికం

● ఉంగుటూరు : గ్రామంలోని చల్లాలమ్మ, భద్రకాళి అమ్మ, కైకరం వల్లీ దేవసేన సహిత శ్రీసుబ్రహ్మణ్వేశ్వర స్వామికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కైకరంలో దాతల సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు.

● చింతలపూడి : కొవ్వూరుగూడెం గ్రామ దేవత ముత్యాలమ్మకు ఆషాడ మాసం సారెను భక్తులు సమర్పించారు. సారె సమర్పణ వల్ల గ్రామంలోని మహిళలకు శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం.

● జంగారెడ్డిగూడెం : మండలంలోని మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానానికి వివిధ రూపాలలో రూ. లక్షా 46 వేల 395లు ఆదాయం వచ్చినట్లు ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు.

● పెదపాడు : అప్పనవీడులోని ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

● కామవరపుకోట :స్థానిక శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితా పీఠంలోని ఆంజనేయస్వామికి అభిషేకాలతో భక్తులు ఆరాధించారు. ఆడమిల్లి, తడికలపూడి, జీలకర్రగూడెం, రావికంపాడు, తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఏలూరు కార్పొరేషన్ :నగరంలోని పలు డివిజన్లలో గల ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు విశేష పూజలు జరిపారు. కోటదిబ్బవద్ద గల ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో, పాండురంగా సెంటర్‌లోని దాసాంజనేయస్వామి సన్నిధిలో అన్న సమారాధనలు నిర్వహించారు. పవరుపేట, ఆర్‌ఆర్‌పేట, దక్షిణపువీధి, డీమార్ట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో గల ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలతో ఆరాధించారు.

● సత్రంపాడులోని అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో వారాహి నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. వారాహి అలంకరణలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా నవరాత్రి పూజలు, పారాయణలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో పూజలు చేయించారు.

ఎంపీ మహేష్‌కు ఘన స్వాగతం



ఎయిర్‌పోర్టులో ఎంపీ మహేష్ యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న జంగారెడ్డిగూడెం టీడీపీ నేతలు

జంగారెడ్డిగూడెం, జూలై 9 : ఎంపీగా పార్ల మెంట్‌లో ప్రమాణస్వీకారం చేసి తొలిసారిగా ఏలూరు వస్తున్న పుట్టా మహేష్ యాదవ్‌కు గన్నవరం ఎయిర్ పోర్ట్‌లో పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, మద్దిపాటి నాగేశ్వరరావు, చెరుకూరి శ్రీధర్, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు ఘన స్వాగతం పలికారు. ఎంపీకి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కోనేటి చంటి, ఎన్.జగత్, సుబ్రహ్మణ్యం, అంజిబాబు, ధర్మయ్య ఉన్నారు.

● కామవరపుకోట : ఎంపీ మహేష్‌కు గన్నవరం ఎయిర్‌పోర్టులో కామవరపుకోట మండల టీడీపీ నాయకులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఘంటా సుధీర్‌బాబు, తెలుగు రైతు ఏలూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు మద్ది పోటి నాగేశ్వర రాంబాబు, తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారథిబాబు, రావికంపాడు సర్పంచ్ వి.నాగేశ్వరరావు, కె.కిషోర్, సీహెచ్.శ్రీధర్, సి.రంగారావు ఉన్నారు.

● భీమడోలు : ఏలూరు జిల్లా టీడీపీ కార్యాలయానికి రానున్న ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్‌కు స్వాగతం పలికేందుకు భీమడోలు టీడీపీ క్యాంపు కార్యాలయానికి నియోజకవర్గ శ్రేణులు తరలి వెళ్లారు.

● పెదపాడు : కూటమి శ్రేణులు అప్పనవీడు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికారు. ఆలయానికి విచ్చే సిన ఎంపీ స్వామిని దర్శించుకున్నారు. తీర్థప్రసా దాలను, చిత్రపటాన్ని ఈవో కూచిపూడి శ్రీనివాస్ అందజేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎంపీ మహేష్‌యాదవ్ ఏలూరు వైపు ర్యాలీగా కదిలారు.


ఫైర్ స్టేషన్ వద్ద ఎంపీ మహేష్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

రైతులకు పసుపు విత్తనాల పంపిణీ

జీలుగుమిల్లి, జూలై 9 : ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్‌లో భాగంగా సీటీఆర్‌ఐ డైరెక్టరు శేషమాధవ్ ఆదేశాలతో రైతులకు వాణిజ్య పంటలపై మంగళవారం అవగాహన కల్పించారు. సీటీఆర్‌ఐ హెడ్ వైవీ సుబ్బయ్య ఎన్‌ఎల్‌ఎస్(ఉత్తర ప్రాంత తేలిక నేలలు)లో అనువైన వాణిజ్య పంటల్ని పండించడం ద్వారా రైతులు లాభాలు పొందవచ్చన్నారు. పసుపు సాగు పంట మార్పిడి విధానాన్ని ఎస్సీ, ఎస్టీ రైతులకు తెలిపారు. ఉద్యాన శాఖ అధికారి ఎం.నవీన ప్రభుత్వం ద్వారా అమలు చేసే పథకాల్ని ఉద్యాన పంటల ఆవశ్యకత, అంతర పంటలు సాగుతో ఆదాయం పెంచె అంశాల్ని వివరించారు. 80 మంది రైతులకు పసుపు విత్తనాల్ని ఉచితంగా అందజేశారు. సీటీఆర్‌ఐ శాస్త్రవేత్తలు ఎం.వెంకటేషన్, ఫామ్ మేనేజర్ టి.వెంకటేష్, సిబ్బంది టి.రమేష్, సీహెచ్ సుధాకర్‌బాబు, వై.వెంకటేశ్వరావు, బి.దుర్గారావు, జీఎస్‌ఎం అన్నపూర్ణ, డి.దేవానంద్, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణానికి రక్షణ

ఏలూరు క్రైం, జూలై 9 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో జిల్లాలో ఉన్న పోలీసులు సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకూ విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, లాడ్జీలలో అనుమానాస్పదంగా ఉన్న వారిని ప్రశ్నించారు. ప్రార్థనాలయాలు, బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఏ విధమైన అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ముందస్తుగా రాత్రిపూట ఆ ప్రాంతాలను కూడా తనిఖీ చేశారు. గంజాయి, సారా, అక్రమ మద్యం రవాణా జరుగకుండా జాతీయ, రాష్ట్రీయ రహదారులపై విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్లు ధరించక పోవడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తలకు బలమైన దెబ్బ తగిలి ప్రాణాలు కోల్పోతున్నారని దీంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. హెల్మెట్లు ఉండడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చునని సూచించారు.

నాసిరకం మందులు విక్రయిస్తే చర్యలు


పావులూరివారిగూడెం ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏడీఏ జగదీశ్వరరెడ్డి

ద్వారకా తిరుమల, జూలై 9: ఎరువుల దుకాణాల్లో నాసిరకం పురుగు మందులు విక్రయించినా, నాణ్యత ప్రమాణాలు పాటించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకునుకుంటామని స్క్వాడ్ ఏడీఏ జగదీశ్వరరెడ్డి హెచ్చరించారు. పావులూరివారి గూడెం గోద్రెజ్ ఆగ్రోవెట్ లి. ఎరువుల దుకాణాన్ని అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒరిజినల్ ఇన్‌వాయిస్‌లు లేని రూ.20 లక్షల 80 వేల 358 విలువైన ఎరువులకు స్టాప్ సేల్ నోటీస్‌ను జారీ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ టి.నాగవెంకటరాజు, ఏలూరు ఏవో ప్రవీణ్, మండల ఏఏవో దుర్గారమేష్ తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి : వ్యవసాయ కమిషనరేట్ నుంచి వచ్చిన స్పెషల్ స్క్వాడ్ బృందం విజయరాయిలోని నూజివీడు సీడ్స్ లిమిటెడ్ పత్తి విత్తన సంస్థలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. నిల్వలను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతుల వివరాలు, ధరల పుస్తకాలను తనిఖీ చేశారు. మంగళవారం రాత్రి వరకు ఈ తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. స్పెషల్ స్క్వాడ్ ఏడీఏ బి.విజయప్రసాద్, ఏలూరు విజిలెన్స్ సీఐ యు.జోసెఫ్ విల్సన్, ఏలూరు డివిజన్ ఏడీఏ వై.సుబ్బారావు, పెదవేగి మండల వ్యవసాయాధికారిణి ఎం.ప్రియాంక, ఏలూరు డివిజన్ టెక్నికల్ ఏవో డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● దెందులూరు : గోపన్నపాలెం పరిధిలోని కొత్తపల్లి రోడ్డులో ఉన్న ఎస్‌ఎస్‌డీ బయోఫెర్టిలైజర్స్ లిక్విడ్ ప్లాంట్‌లో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. విజిలెన్స్ అధికారులు ప్రవీణ్, ఎంఏవో గద్దే రమేష్, పాల్గొన్నారు,



రహదారి మధ్యలో తిష్ఠ వేసిన పశువులు

నడిచే స్పీడ్ బ్రేకర్లు!

రోడ్లపైనే పశువుల తిష్ఠ

బందుల దొడ్డీ లేదాయె.. వాహనదారుల వెతలు

నూజివీడు పట్టణంలో ప్రధాన రహదారులపై పశువులను వదిలి వేయడంతో వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కాదు. పశువులను వాటి యజమానులు రహదారుల పైనే వదిలివేయడంతో రహదారులపై ఉన్న వ్యర్థాలను తింటూ అవి రహదారులపైనే తిష్ఠ వేస్తున్నాయి. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులపై మందలు గా తిరుగుతుండటంతో భారీ వాహనదారులు వాటిని తప్పించి ముందుకు వెళ్లలేక పోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. గతంలో మున్సిపల్ అధికారులు ఇలా వదిలివేసిన పశువులను నూజివీడు కోనేరుపేటలో గల బందులదొడ్డికి తరలించి చర్యలు చేపట్టేవారు. అయితే సదరు బందులదొడ్డి స్థలాన్ని అర్బన్ హెల్త్ క్లినిక్‌కు కేటాయించడంతో పశువులను తరలించే అవకాశం లేదు. దీంతో అధికారులు సైతం ఏమీ చేయలేకపోతున్నారు. రాత్రి సమయాల్లో ఈ పశువులు కనిపించక ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. అధికారులు తక్షణం స్పందించి నడిచే స్పీడ్ బ్రేకర్లుగా మారిన పశువుల యజమానులకు నోటీసులు జారీచేసి వాటిని రహదారులపై ఉండకుండా చూడాలని లేని పక్షంలో సదరు పశువులను గోశాలలకు తరలించాలని, పట్టణ వాసులు కోరుతున్నారు.

-నూజివీడు టౌన్

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరేం..



సింగరాయపాలెం పెదగొన్నూరు ఛానల్ వద్ద ప్రమాద స్థితి

సింగరాయపాలెం - కోరుకొల్లు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో పెదగొన్నూరు ఛానల్ కల్వర్టు వద్ద ప్రమాదకరంగా ఉంది. ఆ కల్వర్టు ఒక పక్క రక్షణ గోడ కూలిపోయి దశాబ్ద కాలమైనా తిరిగి నిర్మాణానికి నోచుకోలేదు. కల్వర్టు వద్ద చిన్న మలుపు ఉండటంతో మరింత ప్రమాదక రంగా ఉంది. సింగరాయపాలెం వైపు నుంచి వచ్చే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రిళ్లు లోడు ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు బోల్తా పడిన సంఘటనలు ఎన్నో జరిగాయి. గత పదేళ్లలో జరిగిన ప్రమాదాల్లో అయిదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. అయినా ఆర్‌అండ్‌బీ కైకలూరు సబ్ డివిజన్ అధికారులకు చీమకుట్టినట్లయినా లేదు. రెండేళ్ల క్రితం ఆ ప్రదేశంలో "ప్రమాదాలు జరిగే స్థలం నిదానంగా వెళ్లండి" అనే బోర్డు పెట్టి అధికారులు చేతులు దులుపుకున్నారే కానీ కూలిన గోడను పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు ఆ హెచ్చరిక బోర్డు కూడా మాయమైంది. అధికారులు స్పందించి కల్వర్టు వెడల్పును పెంచి గోడ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

-ముదినేపల్లి

అప్రోచ్ అయ్యేదెలా..?



ప్రమాదకరంగా ఉన్న ఆరుతెగలపాడు అప్రోచ్ రోడ్డు

కలిదిండి మండలంలో ఆరుతెగలపాడు వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రహదారికిరువైపులా రెయిలింగ్ లేక వాహనాలు అదుపు తప్పి కాల్వలో బోల్తా పడుతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు గాయాల పాలవుతున్నారు. రోడ్డు మార్జిన్ లేకపోవటంతో ఎదురెదు రుగా వస్తున్న వాహనాలు పక్కకు తప్పుకోవటానికి వీలు లేకపోవటంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఈ వంతెన పక్కనే జడ్పీ హైస్కూల్ ఉంది. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అప్రోచ్ రోడ్డుకు ఇరుపక్కలా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ వంతెన వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో రాత్రి వేళల్లో వంతెనపై నుంచి రాకపోకలు సాగించటానికి వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఆరుతెగలపాడు వంతెన అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

-కలిదిండి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాఠశాలలో నీరు లాగేలా తూరల ఏర్పాటు



తూరలు వేయిస్తున్న టీడీపీ నాయకులు

ముసునూరు, జూలై 9: వానొస్తే చెరువే... శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈ నెల 8న ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు, పంచాయతీ పాలకులు స్పందించారు. సూరేపల్లి ఎంపీపీ పాఠశాల ఆవరణ, గదుల్లోకి కొద్దిపాటి వర్షానికే నీరుచేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో మంగళవారం ఎంఈవో బీవీ సుబ్బారావు, సర్పంచ్ ముల్లంగి సుధారాణి పర్యవేక్షణలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ళ నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పొన్నగంటి నాగేశ్వరరావు సహకారంతో రూ. 30 వేలతో ఐదు సిమెంట్ తూరలను తీసుకువచ్చి పాఠశాల నుంచి వర్షపునీరు బయటకు పోయేలా తూరలు వేశారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వార్డుసభ్యులు కొల్లి కొండయ్య, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్, సీఆర్పీ దాసు తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనానికి హాస్టల్‌ను తరలిస్తాం

ఏఎస్‌డబ్ల్యూఓ వెంకట రత్నమ్మ

ముదినేపల్లి, జూలై 9 : ముదినేపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ కళాశాల బాలికల వసతిగృహం అద్దె భవనంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆ శాఖ కైకలూరు ఏఎస్‌డబ్ల్యూఓ వెంకట రత్నమ్మ తెలిపారు. "ఈ హాస్టల్‌లో ఉండేదెలా" శీర్షికన ఈ నెల 8న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. హాస్టల్ భవనంలో విద్యార్థినులకు వసతి సౌకర్యం కల్పించే అవకాశం లేనందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు కూడా ఆదేశించారని తెలిపారు. ముదినేపల్లిలో ప్రైవేట్ భవనంలో హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కొత్త భవనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు.

బావాజీ మఠం చెరువు లీజుకు వేలం

ముదినేపల్లి, జూలై 9 : ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలోని బావాజీ మఠంలోని కోదండ రామాలయానికి చెందిన 21 ఎకరాల చేపల చెరువును మూడేళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు మంగళవారం దేవదాయశాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఎకరాకి ఏడాదికి రూ.50 వేల లీజు చొప్పున గడిదేశి భాస్కరరావు పాడుకున్నారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ యు.సుధాకర్ పర్యవేక్షణలో ఇఓ పి.ఏసు నాయుడు వేలం నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించండి

వైద్య ఆరోగ్యశాఖ రాజమహేంద్రవరం జోనల్ ఎంటమాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ కుమార్

చాట్రాయి, జూలై 9: చీపురుగూడెంలో ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్ళి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ రాజమహేంద్రవరం జోనల్ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ బిఎల్ఎన్ కుమార్ కోరారు. మంగళవారం ఆయన జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సురేష్‌కుమార్‌తో కలసి జ్వరాలు ప్రబలిన చీపురుగూడెంలో పర్యటించి పరిస్థితి సమీక్షించారు. గ్రామంలో ప్రతి వీధికి వెళ్ళి జ్వర పీడితులతో మాట్లాడారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహారాన్ని తినాలని, దోమతెరలు వాడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే వైద్య శిబిరానికి రావాలని ప్రజలను కోరారు. పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన పారిశుధ్య పనులు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. వైద్య శిబిరంలో రికార్డులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ఇంటింటి జ్వరాలు సర్వే, ఎడిస్ లార్వా సర్వేను కొనసాగించి, దోమల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాద్, ఎంటమాలికల్ టీమ్ సభ్యుడు రవిశేఖర్, సీహెచ్‌వో రమణ, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ శ్రీధర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



చీపురుగూడెంలో పర్యటిస్తున్న జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ కుమార్



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న న్యాయాధికారి నాగశైలజ

హెల్మెట్‌తో ప్రమాదానికి చెక్

నూజివీడు, జూలై 9: రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించటం తప్పనిసరి అని, నూజివీడు 15వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎ.నాగశైలజ అన్నారు. మంగళవారం నూజివీడు కోర్టు ఆవరణలో న్యాయవాదులు, న్యాయాధికారులు, కక్షిదారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య నానాటికీ పెరుగుతోందని, హెల్మెట్ ధరించకపోవడం వల్ల మరణాలు సంభవిస్తున్నాయని, ప్రాణనష్టం నివారణకు హెల్మెట్ ధరించటం తప్పనిసరి అని స్పష్టం చేశారు. స్థానిక న్యాయాధికారులు, న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రకాష్, కార్యదర్శి మధు రవిశంకర్, కార్యదర్శులు ఆర్‌వీ సత్యనారాయణ, బసవరాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

యువకుడి వేధింపులతోనే బాలిక ఆత్మహత్య?

కైకలూరు జూలై 9 : బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కైకలూరు రూరల్ ఎస్సై టి. రామకృష్ణ వివరాల ప్రకారం మండలంలోని ఆలపాడు శివారు సోమేశ్వరం కాలనీకి చెందిన దాసరి మిస్సియా (17) సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూలిపనికి వెళ్లి తల్లి రాత్రి ఇంటికి వచ్చి చూడగా కుమార్తె ఆత్మహత్య చేసుకుని ఉంది. మృతురాలు ఆకివీడులోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి లేకపోవడంతో తల్లి మరియమ్మ కూలి పనిచేసుకుంటూ పోషించేది. ఆకివీడు ఉప్పరగూడెం ప్రాంతానికి చెందిన బోదసపు కిరణ్‌కుమార్ కొంతకాలంగా ప్రేమిస్తున్నానని వేధింపులకు గురి చేయడమేగాక చదువు మాని వేసి పెళ్లి చేసుకుందామని బలవంతం చేస్తున్నట్టు తల్లి ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

ముదినేపల్లి, జూలై 9 : ముదినేపల్లి మండలం చిగురుకోట గ్రామంలో ఈ నెల 3న నడక దారిలో మురుగునీరు వెళుతున్న విషయమై అన్నదమ్ములు, తోడికోడళ్ల మధ్య ఏర్పడిన వివాదం హత్యకు దారి తీసిన ఘటనలో నిందితులైన తుమ్మా సురేష్, అతని భార్య అనితలను అరెస్టు చేశారు. వీరిని కైకలూరు రూరల్ సీఐ కృష్ణ కుమార్ మంగళవారం అరెస్టు చేశారు. ఈ ఘటనలో కత్తి పోట్లకు గురైన పరసా వెంకట బాలాజీ భార్య దేవి ఈ నెల 5న మృతి చెందిన విషయం విదితమే. ఈ కేసులో అరెస్టు చేసిన సురేష్, అనితలను కైకలూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్టులో హాజరుపర్చగా, మెజిస్ట్రేట్ ఎం. శివకిరణ్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



పర్వతనేని రామకృష్ణ

ముసునూరు, జూలై 9: మతి స్థిమితం సరిగాలేని వ్యక్తి అదృశ్యమైన ఘటనపై మంగళవారం ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు వివరాల ప్రకారం మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన పర్వతనేని వెంకట గోవర్ధన రెండో కుమారుడైన రామకృష్ణ (46) అమాయకంగా ఉండటంతోపాటు మతిస్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సూమారు 11 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అతని ఫోన్ కూడా ఇంటిలో ఉంది. రామకృష్ణ కోసం పలుచోట్ల వెదికినా ఆచూకీ తెలియకపోవడంతో అతని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



ముసునూరు, జూలై 9: మండలంలోని వలసపల్లి తమ్మిలేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. స్థానికుడైన చిట్టిమాద రమేష్ తన సొంత ట్రాక్టర్‌తో తమ్మిలేరులో రాత్రి సమయంలో ఇసుక లోడ్ చేసుకుని, ఉదయం చెక్కపల్లి వైపు తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. రమేష్‌ను అదుపులోకి తీసుకుని, ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని బలివే, వలసపల్లి, యల్లాపురం, లోపూడి గ్రామాల్లో ఉన్న తమ్మిలేరు నుంచి ఇసుక రవాణాకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా తమ్మిలేరు నుంచి ఇసుకను తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వాసు హెచ్చరించారు.

సొంతింటి కల సాకారానికే ఉచిత ఇసుక



ఇసుక ట్రాక్టర్ల ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు జూలై 9 : పేదల సొంతింటి కల సాకారం చేయాలని ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరులో ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు ఆధ్వర్యంలో ట్రాక్టర్లలో ఇసుక తెచ్చి లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. ఇసుక ట్రాక్టర్లకు కైకలూరులో కూటమి నాయకులు టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలను కట్టి జాతీయ రహదారి వెంబడి ర్యాలీ నిర్వహించారు. ఒక ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్వయంగా నడుపుతూ ప్రజలకు ఇసుక పాలసీపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో ఇసుక వ్యాపారం చేసి వేలాది కోట్లు జగన్, వైసీపీ నేతలు దోచుకు తిని భవన నిర్మాణ కార్మిక రంగాన్ని కోలుకోలేని దెబ్బతీశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వానికి ఆదాయం రాకపోయినా ప్రతి పేదవాడు సొంతంగా ఇల్లు నిర్మించుకోవాలని, తద్వారా భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చిందన్నారు. ఇసుక ఉచితంగా అందిస్తున్నందుకు ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కూటమి నాయకులు పోలవరపు లక్ష్మీరాణి, కొడాలి వినోద్, ఎండీ జానీ, పూలరాజీ, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టించి గ్రామాలు అభివృద్ధి చేయాలి

పంచాయతీకి ఆదాయ వనరులను పెంచి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరు పంచాయతీ కార్యాలయ సిబ్బందితో సర్పంచ్ డీఎం నవరత్నకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతానన్నారు. ఏలూరు రోడ్డులోని డంపింగ్ యార్డ్‌ను తీసివేసి మరోచోటుకు మార్పు చేస్తామని సంపద సృష్టికి ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేస్తున్నామన్నారు. దాతల సహకారంతో కాలువల్లో చెత్త తొలగింపు పనులను చేపడుతున్నట్లు తెలిపారు. రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కైకలూరు పట్టణంలో విచ్చలవిడిగా ఉన్న ఆర్వోప్లాంట్లు నిర్వహణ నిబంధనల మేరకే ఉండాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. రహదారుల పక్కన తోపుడుబండ్లపై వ్యాపారం చేసుకోవాలని స్థిరంగా షాపులను ఏర్పాటుచేస్తే వాటిని తొలగించాలన్నారు. కైకలూరు పట్టణంలో పందులు లేకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. జెడ్పీటీసీ కురేళ్ళ బేబి, మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి...

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే కామినేని అన్నారు. మంగళవారం వరహాపట్నంలోని తన ఇంటి వద్ద, శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో అమ్మకు మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం కైకలూరు ఎన్జీవోస్ కాలనీలో, తహసీల్దార్ కార్యాలయంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 400 మొక్కలను నాటారు. అనంతరం ఎన్జీవోస్ కాలనీలోని రహదారులను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ పోతురాజు, మానవత సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ, మాజీ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఉచితంగా కళ్ళజోళ్ళను పంపిణీ చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

మానవత కళ్ళజోళ్ళ వితరణ

కైకలూరు జూలై 9: మానవత సేవలను మరింత విస్తృతం చేస్తామని సంస్థ అధ్యక్షులు కొండ్రెడ్డి చిట్టెమ్మ అన్నారు. మంగళవారం కైకలూరులో 55 మంది పేదలకు ఉచితంగా కళ్ళజోళ్ళను పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు మాట్లాడుతూ పేద విద్యార్థులకు సహకారం అందిస్తామన్నారు. సంస్థ మాజీ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ, సభ్యులు కొండ్రెడ్డి ప్రభాకరరావు, కె శాంతిప్రియ, గుర్రం శ్యాంకుమార్, ఇమ్మడి విఠల్, బాషా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల ఫ్యాన్ల వితరణ



మండవల్లి జూలై 9 : మండవల్లి జడ్పీ హైస్కూల్ 2010కి చెందిన టెన్త్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు మంగళ వారం ఫ్యాన్లు బహూక రించా రు. ఏఎంసీ ఛైర్మన్ వీర్రాజు, మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ చేతుల మీదుగా హెచ్ఎం ప్రసాద్ కి ఫ్యాన్లు అందజేశారు. పూర్వ విద్యార్థులు మెండా సురేష్‌బాబు, రాజేష్ పాల్గొన్నారు.

మూడేళ్ల తర్వాత తల్లి చెంతకు బాలుడు

ఏలూరు క్రైం/ బుట్టాయగూడెం, జూలై 9 : ఇంటి నుంచి మూడేళ్ల క్రితం వెళ్లిన గిరిజన బాలుడు తల్లి చెంతకు చేరుకున్న ఘటన మంగళవారం జరిగింది. ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బాలుడిని తల్లికి అప్పగించారు. బుట్టాయగూడెం మండలం మర్లగూడెంకు చెందిన కొవ్వాసి మహాలక్ష్మి, శ్రీను దంపతుల కుమారుడు కొవ్వాసి నందకిషోర్. మూడేళ్ల క్రితం జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఐదో తరగతిలో తల్లిదండ్రులు చేర్చారు. చదువుపై ఇష్టంలేని బాలుడు 2021లో పారిపోయాడు. వారం రోజుల క్రితం ఆ పన్నెండేళ్ల బాలుడు హౌరా రైల్వేస్టేషన్‌లో ఉన్నట్టు అక్కడ సీడబ్ల్యూసీ ద్వారా ఏలూరు డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌కు సమాచారం అందింది. స్పందించిన ఐసీడీఎస్ అధికారిణుల ఆదేశాల మేరకు బుట్టాయగూడెం ఐసీడీఎస్ సిబ్బందితో సంప్రదించి తల్లితో ఆ బాలుడిని వీడియో కాల్ ద్వారా మాట్లాడించి గుర్తించారు. ఆమె తన కుమారుడిని తీసుకురావాలని కోరడంతో ఈనెల ఎనిమిదో తేదీన ఏలూరు జిల్లా కేంద్రానికి రప్పించారు. మంగళవారం కలెక్టర్ సమక్షంలో అతడిని తల్లి మహాలక్ష్మికి అప్పగించారు. సుదీర్ఘ కాలంగా దూరమైన కొడుకు అధికారుల కృషి వల్ల తిరిగి తన వద్దకు చేరడంతో ఆ తల్లి ఎంతో సంతోషపడింది.



రహదారి మరమ్మతులను పరిశీలిస్తున్న జోగిరాజు

స్వచ్ఛందంగా నిర్మిస్తున్న రహదారి పరిశీలన

కలిదిండి, జూలై 9: లంక గ్రామాల ప్రధాన రహదారి మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు అన్నారు. మంగళవారం కూటమి నాయకులు, రైతులు స్వచ్ఛందంగా మరమ్మతులు చేస్తున్న లంక గ్రామాల రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్వాయిపాలెం నుంచి పెదలంక వరకు 15 కిలోమీటర్ల మేర సుమారు 15 లక్షలతో స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేయటం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వం దాతలు రోడ్డు మరమ్మతులు చేస్తే వారిపై కేసులు పెట్టిందన్నారు. కూటమి నాయకులు మంతెన సుబ్బరాజు, సారిక వెంకటేశ్వరరావు, ముద్దం భోగేశ్వరరావు, అక్కుల వెంకటాచలం, పోకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కాలినడకన ద్వారకా తిరుమలకు...

చాట్రాయి, జూలై 9: మండలంలోని ఆరుగొలనుపేట గ్రామానికి చెందిన టీడీపీ ముఖ్య కార్యకర్త ఇజ్జిగాని మురళీకృష్ణ, సీఎంగా చంద్రబాబు, మంత్రిగా కొలుసు పార్థసారథి పదవులను చేపడితే కాలినడకన ద్వారకా తిరుమల చిన్న వెంకన్న దర్శనానికి వస్తానని మొక్కుకున్నారు. కోరిక తీరటంతో మంగళవారం మురళీకృష్ణ గోవింద నామ స్మరణ చేసుకుంటూ కాలినడకన ద్వారకా తిరుమల బయలుదేరి వెళ్ళారు. స్థానిక టీడీపీ నాయకులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, పానుగళ్ళ కోటేశ్వరరావు తదితరులు మురళీకృష్ణ పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు.

15న జగన్నాథ రథయాత్ర

నూజివీడు, జూలై 9: ఇస్కాన్ నిర్వహణలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. మధ్యాహ్నం 3 గంటలకు నూజివీడు రాజీవ్ సర్కిల్ నుంచి చిన్నగాంధీబొమ్మ సెంటర్, పొట్టిశ్రీరాములు సెంటర్, పెద్దగాంధీబొమ్మ సెంటర్, డీఏఆర్ కాలేజ్ మీదుగా ఈ రథయాత్ర సాగి నూజివీడులోని రాజగోపాలస్వామి ఆలయం వద్ద ముగుస్తుందని తెలిపారు.

మంత్రి చొరవతో పాఠశాలకు బస్సు సర్వీసు



ముసునూరు, జూలై 9: నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో వలసపల్లి నుంచి గుడిపాడు జడ్పీ పాఠశాల వరకు విద్యార్థుల కోసం నూతన బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. వలసపల్లి, గుళ్ళపూడి, గుడిపాడు గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలకు వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారని స్థానిక టీడీపీ నాయకులు గద్దె రఘుబాబు, కొల్లి గంగారామ్, మేదరమెట్ల సురేంద్ర ఇటీవల మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళారు. ఆయన వెంటనే స్పందించి నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థుల కోసం మూడు గ్రామాలను కలుపుతూ నూతన బస్సు సర్వీసు నడపాలని మంత్రి సూచించినట్లు నాయకులు తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు మంగళవారం వలసపల్లి నుంచి ఏర్పాటు చేసిన బస్సు సర్వీసును సర్పంచ్ చలసాని దామోదరరావు తదితరులు ప్రారంభించారు. మంత్రి పార్థసారిధికి మూడు గ్రామాల విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత ఫిజియోథెరపీ శిబిరం



ముసునూరు, జూలై 9: రమణక్కపేట మెయిన్ పాఠశాలలో దివ్యాంగ చిన్నారులకు మంగళవారం ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ జి. ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహించి, వారిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు వివరించారు. అలాగే దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చికిత్సను, ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రశాంతి కోరారు. శిబిరంలో ఐఈఆర్టీలు డీఎంవీ లక్ష్మీనారాయణ రావు, జె.నాగమల్లీశ్వరి, హెచ్ఎం లోకరాజు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు: ఈవోపీఆర్డీ



ముసునూరు, జూలై 9: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుతో పాటు దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ముసునూరులో సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మియా, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరావు పర్యవేక్షణలో గ్రామంలోని అన్ని కాలనీల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రతి గ్రామంలో పారిశుధ్యం మెరుగు పరచి దోమల నివారణకు మలాథియాన్ పిచికారీ, బ్లీచింగ్ చల్లడంతోపాటు ఫాగింగ్ చేస్తున్నామని ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తెలిపారు.

గ్రామాల్లో ఫాగింగ్

చాట్రాయి, జూలై 9: సీజనల్ జ్వరాలు ప్రబలిన చీపురుగూడెం, చిన్నంపేట గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో దోమల నివారణకు సోమవారం రాత్రి ఫాగింగ్ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, నిషాక్ అలీ, వైద్య సిబ్బంది దోమల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు.



గోపాలపురంలో కళకళలాడుతున్న వెదజల్లిన వరి పొలాలు

వెదజల్లిన వరి పొలాలు కళకళ

కలిదిండి, జూలై 9 : వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో మండలంలో వెదజల్లిన వరి పొలాలు పచ్చగా కళకళలాడుతున్నాయి. కాల్వలకు సాగునీరు విడుదల చేయనప్పటికీ వర్షాలు కురవటంతో రైతులు మెట్ట దుక్కులు దున్ని విత్తనాలు వెదజల్లారు. అప్పటి నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో విత్తనాలు మొలకెత్తి వరి పొలాలు పచ్చగా ఉండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సకాలంలో సార్వా పంట చేతికి వస్తుందని భావిస్తున్నారు. పట్టిసీమ ఎత్తిపోతల నుంచి గోదావరి నీరు కృష్ణానదిలోకి వస్తుండటంతో డెల్టా ప్రాంతానికి సాగునీరు విడుదల కానుండటంతో రైతులు తమ వరి పొలాలకు నీరు పెట్టుకోవటానికి సమాయత్తమవుతున్నారు. సకాలంలో వర్షాలు కురవటంతో ఈ ఏడాది జూన్ నెలలో సార్వా సాగును ప్రారంభించారు. ఎండిన బీడుల్లో సైతం వర్షాలకు పచ్చగడ్డి మొలకెత్తడటంతో పశువులకు మేతగా పచ్చగడ్డి సమృద్ధిగా దొరుకుతుంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.